ప్రజాశక్తి

Vol. 1, no. 23

(Nov. 18, 1942)

బెజవాడ, 1942

Prajāśakti

Vol. 1, no. 23

(Nov. 18, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6

PRAJA SAKTI

Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
ముద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 18-11-42 బెజవాడ | సంచిక 23

మిత్రమండలి ఆఫ్రికా విజయాలు రెండవ రంగానికి దారి తీస్తాయి

ఫాసిజం ఇటలీలో మొదట తలయెత్తి మధ్యధరా సముద్రం మీదుగా ముందుకు పోయింది. మరల దాని వినాశనము మధ్యధరా సముద్రం మీదుగానే ముందుకు పోతూవుంది.

మిత్రమండలి దెబ్బ కాచుకునే స్థితిని వదలి, దెబ్బకొట్టే స్థితికి వచ్చినప్పటినుంచి విజయాలమీద విజయాలు సంపాదిస్తున్నది.

ఈజిప్టు రంగంలో మిత్రమండలి సైన్యాలు 9 రోజులలో 800 మైళ్ళు, 2 రోజులలో మరొక 130 మైళ్ళు ముందుకు పోయాయి. ఈజిప్టుయుద్ధం అయిపోయింది. లిబియా యుద్ధం ప్రారంభమైంది.

హల్ఫాయా కనుమ, సాలుం రోడ్డు బ్రిటిషు బాంబర్ల దెబ్బకు చాలావరకు నాశనం అయాయి. బ్రిటిషు సైన్యంలో ఒక శాఖ సముద్రతీరం మీదుగా ముందుకు పోతుంటే మరొక శాఖ దక్షిణంగా మడలీనా అనే పట్టణంవైపు పోతున్నాయి. ఇది ఒక అడకత్తెర వ్యూహం రెండువైపులా వచ్చి, పారిపోతున్న రొమెల్ సైన్యాన్ని సర్వ నాశనం చేయటమే దీని ఆశయం.

టోబ్రూకులో నిలబడి ప్రతిఘటిస్తా డనుకున్న రొమెల్ టోబ్రూకును గూడా జారవిడిచాడు. బ్రిటిషు సైన్యాలు టొబ్రూకును వశం చేసుకొని గజాలవైపుకు పోయాయి.

ప్రపంచ యుద్ధ సమీక్ష

కైరో రేడియో ప్రకారం డార్నావో అక్ష రాజ్య సైన్యాలు తమ నిలవ సామగ్రినంతా తగలపెడుతున్నాయి. ఈవిషయం చూస్తే రొమెల్ సైన్యం యింకా వెనక్కుపోయేటట్లు కనపడుతుంది.

ఈ యుద్ధంలో నాజీలకు ప్రబల నష్టాలు సంభవించినవి. యుద్ధ సామగ్రి మితిమీరి నాశనం అయింది. జర్మనులు, ఇటాలియన్లలో, దెబ్బలు తిన్నవారు, చచ్చినవారు మొత్తం 59,000. ఈ విధంగా రొమెల్ సైన్యం ఓడిపోయింది. అది చిందరవందర అయిపోయింది. చాలా భాగం మరల పోట్లాడ డానికి వీలులేకుండేటట్లు దెబ్బలుతిన్నది.

అటునుంచి అమెరికా

ఉత్తర ఆఫ్రికా యుద్ధం కోసం జులై నెలలో ప్లానులు వేశారు. స్టాలిన్ చెప్పినట్లు, అప్పటినుంచీ చాలా చాకచక్యంతో సన్నాహాలు జరిగాయి. 1,40,000 అమెరికను సైన్యం, 850 నావలలో 20,000 మైళ్ళ దూరంనుంచివచ్చి హటాత్తుగా పశ్చిమోత్తర ఆఫ్రికాపై పడింది. ఒక వారం రోజులలోనే వారికి కావలసిన కీలక స్థలాలు అన్నీ పట్టుపడ్డాయి.

మొదట లైయోటీ, మెహిదియా అనే రేవులు అమెరికనుల వశమయ్యాయి. కాజబ్లాంకాకు ఆగ్నేయంగా ఉన్న మొగడార్, ఫెడాలా, సాఫీ మొదలగు రేవులు ఆక్రమించబడ్డాయి. మిగుల ప్రాముఖ్యమైన కాజబ్లాంకాకూడా తరువాత పడిపోయింది. అటు ఉత్తర ఆఫ్రికాలో ఓరాన్, ఫెరూఖీ, అల్జెర్సు కష్టంలేకుండానే చిక్కిపోయాయి.

ఫ్రెంచి భూసైన్యాలు అమెరికనులను అడ్డుకోలేదు. ఆరంభంలో ఫ్రెంచి నౌకలనుండి కొంత ప్రతిఘటన వచ్చింది.

విషీప్రభుత్వంలో చీలిక

మార్షల్ పిటైన్ ప్రభుత్వం అమెరికాతో సంబంధాలు విడగొట్టుకుంది. కాని, అడ్మిరల్ డార్లన్ మార్షల్ పిటైన్‌తో విడిపోయి మిత్రమండలితో గలిశాడు. అంతవరకు నౌకాదళాధిపతిగాఉన్న డార్లన్ మిత్రమండలిపై యుద్ధంచాలించమని నౌకాదళానికి ఆజ్ఞఇచ్చాడు. ఇంతేగాదు, మంచి పలుకుబడిగల ఫ్రెంచి సైనికాధికారి జనరల్ గిరో ఫ్రాన్సునుంచి తప్పించుకొని అమెరికన్ సైన్యాలకు సహాయంగావచ్చి నిలిచాడు. ఈ విధంగా మిత్రమండలి ఫ్రెంచి పాలకవర్గంలో చీలికదెచ్చి రాజకీయంగా ఒక విజయంగాంచింది.

ఎత్తుకు పైఎత్తులు

ఈ క్రొత్త దాడిని గురించి మాట్లాడుతూ, చర్చిలు దీని ఆశయాలు వెల్లడించాడు. ఒకటి: హిట్లరుపై క్రొత్తరంగం తెరవటం. రెండు : మధ్యధరాసముద్రంలో మిత్రమండలి విమాన నౌకాబలానికి ఆధిపత్యం కల్గించడం.

ఈదాడి అంతరార్థం ఇంకాఉంది. పరుగెత్తుకొనివచ్చి రొమెల్ సైన్యాన్ని వెనుకనుంచితాకి, ఆసైన్యాన్ని హతమార్చడం. సబ్మెరీన్ల ప్రమాదాన్ని తొలగించి రష్యాకు మిక్కిలి దగ్గర సరఫరామార్గం కల్పించటం. ఆధిపత్యం, హంగు ఒనగూడిన తరువాత ఇటలీమీద- బాల్కనులమీద బాంబులు వేయటం అటుంచి- ఆక్రమణ సాగించడం.

కాని, ఈ వ్యూహాన్ని హిట్లరు ఏవిధంగా భేదించదలచుకున్నాడు ?

మిత్రమండలి అనుకున్నట్లు కావాలంటే వారు ట్యూనిషియాను పట్టుకోవాలి. దానిపై వారు కన్నువేసి ఉంచారు. ఈవిషయం గ్రహించిన హిట్లరు వెంటనే మూడు అర్డర్లు జారీచేశాడు.

—విషీ ఫ్రాన్సును ఆక్రమించుకోటం;

—ట్యూనిషియాలో విమానాలద్వారా సైనికబలాన్ని దింపటం;

—ఇటలీ రక్షణను గట్టిపరచడం.

విషీ ఫ్రాన్సును ఆక్రమించుకోటంలో ముఖ్యంగా రెండు ఉద్దేశ్యాలు; ఒకటి: మిత్రమండలి నూతన దాడిని జూచి, ఆకలితోను, నాజీ నిర్బంధంతోను, యమయాతనలు పడుతున్న ఫ్రెంచి ప్రజలు ఆశగలిగి తిరుగబాట్లు చేయవచ్చు. రెండు ఇంతవరకు రక్షణలేమీలేని ఫ్రాన్సు సముద్రపు సరిహద్దు మిత్రమండలి దాడికి మంచి అవకాశం. వీనిని ఎదుర్కొ డానికే హిట్లరు అనాక్రమిత ఫ్రాంసునుకూడా ఆక్రమించాడు.

ఇక, ట్యూనిషియా దీనిని ఆక్రమించటానికి ప్రయత్నించడంలో హిట్లరుకు కలిగేలాభం ఏమిటి ?

ఒకటి; రొమెలు సైన్యానికి అండగా నిలబడి, రొమెలును సర్వనాశనంనుండి తప్పించడానికి ట్యూనిషియాతప్ప వేరు మార్గంలేదు. ట్యూనిషియా సిసిలీకి 100 మైళ్ళ దూరంలో ఉంది. పాన్టల్లేరియాదీవి 40 మైళ్ళలోఉంది. ఈరెండూ ఇటాలియనుదీవులే. రెండూ రక్షణలనుబాగా కల్గినవే. సిసిలీనుండి పాన్టల్లేరియాకు, పాన్టల్లేరియానుండి ట్యూనీషియాకు అక్షసైన్యాలు బాగా సరఫరా అవుతాయి. ఈమూలంగా హిట్లరు ఆఫ్రికాలో మిత్రమండలిని ఎదిరించవచ్చు.

రెండు: ట్యూనిషియాలో బాగా స్థావరమేర్పరచుకుంటే ట్యూనిషియాకు సిసిలీకి, దానికి చుట్టుపక్కల ఉన్న సముద్రాన్ని, ఆధీనంలో ఉంచుకోవచ్చు. మిత్రమండలి నౌకాశ్రేణులకు మంచి నష్టం కలుగచేయవచ్చు.

ఇదేగాక, ఈరెండూ (విషీఫ్రాన్సు, ట్యూనిష్యా) ఆక్రమించుకోటంలో హిట్లరుకు ఇంకొక ఉద్దేశ్యం ఉండవచ్చు. విషీఫ్రాన్సు సముద్రతీరాన్నంతా ఆక్రమించుకొని, పైరెనీస్ గుండా వెళ్ళే రైలుమార్గంగా స్పెయినుకు సైన్యాన్నిపంపి జిబ్రాల్టరును ఆక్రమించుకోవచ్చు. ఈసైన్యానికి సహాయకారిగా స్పానిష్ మొరాకోలో సైన్యాన్ని దింపవచ్చు. ఈ విధంగా, కష్టమైనా, మధ్యధరా సముద్రాన్ని బిగించి పారవేసి మిత్రమండలి రవాణా సౌకర్యాలను బందుచేయవచ్చు.

ఈ పరిస్థితులు రాకుండా చేయడానికి మిత్రమండలి జాగ్రత్తపడుతోంది. అమెరికను సేనలు, బ్రిటిషు సేనలు ట్యూనిస్ లక్ష్యంగా ముందుకు సాగిపోతున్నాయి. అమెరికను సేనలు కాజబ్లాంకా, ఓరాన్, అల్జెర్స్ ఆక్రమించుకొన్నాయి. ఈ మూడు రేవులను కలుపుతూ ట్యూనిసుకు ఒక రైలు మార్గం వుంది. ఈ మార్గంగుండా మధ్యధరా సముద్రం వీలు లేకపోయినా, మిత్రమండలి ఉత్తర ఆఫ్రికాకు సప్లయి పంపుకోవచ్చు. ఇంతేకాక ట్యూనిషియాలో నాజీ సేనలు నిలువకుండా చేయటానికి అమెరికనులు ట్యూనిషియాపై దాడి చేస్తున్నారు. అప్పుడే ట్యూనీషియా సరిహద్దులను దాటారు. ట్యూనిసుకు దగ్గర ఉన్న బోన్ అనే రేవును ఆక్రమించుకున్నారు. బలం కూర్చుకుని తీవ్ర దాడి ప్రారంభించదానికి ప్రయత్నిస్తున్నారు. అప్పుడే బైజెర్టాలో నాజీ సేనలు అమెరికను సేనలు తలపడ్డాయని వార్తలు.

ఫాసిస్టు అనుకూలుర టముకు

ఇంగ్లండులో కొంతమంది ఈ నూతన దాడినే రెండవ రంగం అని టముకు వేస్తున్నారు. ఇది యెవ్వరినీ మోసపుచ్చలేదు. స్వాతంత్ర్య ఫ్రెంచి నాయకుడైన జనరల్ కటూాజే యీ విధంగా అన్నాడు. "ఫ్రాన్సు దేశమంతా కోరుతూన్న రెండవ రంగం రూపొందుతోంది." అమెరికా అధ్యక్షుడు రూజువెల్టు మొదలగువారు రెండవరంగం 1943 లోనే

కామ్రేడ్
జి. రాధాకృష్ణమూర్తి

ప్రారంబించ గల్గుతామని చెప్పుతున్నారు. బ్రిటనులోని సోవియట్ యూనియన్ రాయబారి మెయిస్కీ యిది రష్యనులు కోరే రెండవ రంగంగాదనీ; కాని యిది రెండవ రంగానికి మెట్టనీ, దీనివల్ల రెండవ రంగం త్వరలోనే ఫలిస్తుందనీ చెప్పాడు. అమెరికా కార్మిక సంస్థ (సి. ఐ. ఓ.) రెండవ రంగం వెంటనే తెరవాలని కోరుతూ తీర్మానించింది.

దీని ప్రాముఖ్యత

ఈ నూతన దాడియొక్క ప్రాముఖ్యత యేమిటి ? స్టాలిన్ చెప్పిన మాటల బట్టి,

ఒకటి :— చొరవ మిత్రమండలి చేతుల్లోకి పోయింది;

రెండు :— యూరపులోని రాజకీయ, యుద్ధ పరిస్థితులు, బ్రిటిషు - సోవియట్ - అమెరికాలకు బాగా అనుకూలంగా మారింది;

మూడు :— హిట్లరు పరపతిని తగ్గించివేసింది; అక్షరాజ్యాలకు నిస్పృహ కలుగజేసింది;

నాలుగు :— ఫ్రాన్సు ప్రజల స్తబ్దతను పోగొట్టి, హిట్లరు ప్రతికూల ఫ్రెంచి సైన్య నిర్మాణానికి అధారమైంది:

ఐదు :— ఇటలీని వేరుపరచే పరిస్థితులను కల్గిస్తుంది;

ఆరు :— నాజీ జర్మనీని యేకాకిగా చేస్తుంది;

చివరకు జర్మనీ ఆయువు పట్టులకు సమీపంగా రెండవ రంగాన్ని తెరవడానికి అవసరమైన పరిస్థితులను వొనగూరుస్తున్నది.

నైతికంగాను, రాజకీయంగాను, సైనికంగానూ యీ దాడి మంచి ప్రాముఖ్యత వహిస్తుంది.

దీనికి నిదర్శనాలు : మార్షల్ పిటైన్ అమెరికనుల దాడి ప్రారంభమవగానే ఫ్రెంచి సైనికులకు, ప్రజలకు గావించిన ఉపన్యాసంలో "శాంతంగా వుండండి; శాంతంగా వుండండ"ని నొక్కిచెప్పాడు. ఈ దాడి ఫ్రెంచి పీడిత ప్రజలను ఎక్కడ ఉద్రిక్తులను చేస్తుందో అని ఆయన భయం. ఇటాలియను నావికులు ఆజ్ఞయిచ్చినా, రేవు విడచి రామని అధికార ఆజ్ఞను తిరస్కరించారు.

(మిగతా 10 వ పేజీలో)

ప్రజాశక్తి

18-11-42 బుధవారం

అస్త్రసన్యాసం

14 వ తేదీ హిందూపత్రికలో ఈ క్రిందివార్త ప్రకటింపబడింది. "ఈనెల 7, 8 తేదీలలో గోగినేని లక్ష్మీనారాయణగారి అధ్యక్షతను సమావేశమయిన ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘ వర్కింగ్‌కమిటీ సమావేశము తీవ్ర రాజకీయ భేదాభిప్రాయాల వల్ల అఖిలభారత కిసాన్‌సభనుండి విడిపోవడానికి నిర్ణయించింది.

"రాష్ట్ర వర్కింగ్‌కమిటీ ప్రస్తుత అసాధారణ జాతీయ సంక్షోభం వల్లను, ఎట్టి పౌరసత్వ హక్కులు లేకపోవడం వల్లనూ, కిసాన్ సభ కాన్‌స్టిట్యూషన్ అంతటినీ రద్దు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఎన్. వెంకట్రామానాయుడుగారిని రాష్ట్ర యేజెంటుగా నియమించింది. అవసరమైనచోట జిల్లా ఏజంట్లను, తన తరువాత రాష్ట్ర ఏజెంటును నియమించడానికి వారికి అధికారమివ్వబడినది."

భారత రాజకీయాలలో ప్రజాసంస్థలు నిరంకుశాధికారులచే నిషేధించబడటం, బహిరంగంగా పనిజేసే అవకాశం లేకపోవడం సాధారణ విషయమే. కాని యీ విధంగా తమంతటతామే కాన్‌స్టిట్యూషన్ రద్దుచేసికోడం విచిత్రమైన విషయం. బానిస భారతదేశంలో పౌరసత్వ హక్కులు మృగ్యమగుట నేడు మనకు క్రొత్త గాదు. అందులోనూ యుద్ధం వచ్చాక డిఫెన్సు ఆఫ్ యిండియా ఆక్టుక్రింద సర్వాధికారాలు పోలీసుల హస్తగతమయిన మాటకూడ నిర్వివాదాంశమే. అందుచే పైవార్త చదివినవారు వెంటనే రైతుసంఘ వర్కింగ్‌కమిటీ ఆంధ్రరైతుసంఘాన్ని రద్దుచేయడం గాంచి, సామాన్య వ్యవహారాలు కూడ జరుగకుండా ప్రభుత్వం ఆటంకం కలిగించుటవల్ల కాబోలునని భ్రమపడవచ్చు. కాని వాస్తవిక విషయంమాత్రం అదికాదు.

పైవార్తలోనే అఖిలభారత కిసాన్‌సభనుండి విడిపోవుటకు నిర్ణయించబడిందనే సంగతిని ఒకసారి పరికించి, విషయాన్ని ఆమూలాగ్రంగా అర్థం చేసికొంటే అసలు రహస్యం బయటపడుతుంది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంలో వివిధ రాజకీయపార్టీలు యుద్ధానికి పూర్వం కలసి పనిచేసేవి. అందులో ప్రధానమైనవి కమ్యూనిస్టుపార్టీ, రంగాగ్రూపు. కొన్ని జిల్లా రైతుసంఘాలలో రంగా గ్రూపువారు అధికారంలో వుంటే, కొన్నిటిలో కమ్యూనిస్టులు అధికారంలో వుండేవారు. మొత్తంపై అన్ని జిల్లాలలోనూ, రాష్ట్ర రైతుసంఘంలోనూ, అందరూ కలసి పనిజేసేవారు. యుద్ధం వచ్చింది. నిర్బంధవిధానం జోరుసాగింది. కమ్యూనిస్టులు అనేకమంది నిర్బంధింపబడ్డారు. తక్కినవారు రహస్యంగా వుండి పనిచేయవలసివచ్చింది. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లా రైతుసంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ముఖ్యులందరూ డిటెయిన్ చేయబడుటచే పని మూలబడింది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం సామ్రాజ్యవాద యుద్ధ దశలో బహిరంగంగా పని చేయడానికి అవకాశముండుటచే అది రంగా గ్రూపువారికి పూర్తిగా హస్తగతమయింది. కృష్ణాజిల్లా రైతుసంఘం మాత్రం ఎప్పటివలెనే పని జేస్తూంది. పశ్చిమ గోదావరి జిల్లా రైతుసంఘాన్ని పునరుద్ధరించడానికి 1941లో కమ్యూనిస్టులు ప్రయత్నించారు. జనరల్‌బాడీ మీటింగ్ జరిపి, క్రొత్త ఆర్గనైజరును ఎన్నుకొన్నారు. వారు వున్న స్వల్ప అవకాశంలోనూ రైతుసంఘ సభ్యులను చేర్పించడానికి ప్రయత్నించారు. కాని రాష్ట్ర రైతుసంఘంలో అధికారమందున్న రంగాముఠా సభ్యత్వ పుస్తకాలు యివ్వలేదు. పాతపుస్తకాలపై చేర్పించి, డబ్బు రాష్ట్రసంఘానికి పంపినా సభ్యత్వాన్ని గుర్తించ నిరాకరించింది. ఇంతేగాక రాష్ట్ర రైతుసంఘం అచ్చువేసే సభ్యత్వ ఫారాలనుతప్ప గుర్తించమని ఒక తీర్మానం ప్యాసుచేసి, కమ్యూనిస్టులు స్థానిక సంఘాలలో పలుకుబడి కలిగివున్నచోట్లకు పుస్తకాలు యివ్వడంలో అనేక అభ్యంతరాలు కల్పించసాగింది. ఈ సందర్భంలో ఒకసంగతి జ్ఞాపకం చేయాలసిన అవుసరముంది. యుద్ధ అవకాశాన్ని వినియోగించుకొని, రాష్ట్రరైతుసంఘంపై రంగా గ్రూపు అధికారాన్ని స్థాపించుకొనకపూర్వం, జిల్లాసంఘాలే తమ సభ్యత్వ ఫారాలను అచ్చువేసుకునేవి. ఈ విషయమై ఎట్టి తగాదాలు అప్పుడు రాలేదు. రంగా గ్రూపు యీ క్రొత్త నిబంధన పెట్టడం రాష్ట్ర రైతుసంఘాన్ని తమ హస్తాలలో చిరస్థాయిగా వుంచుకోడానికే అనుట స్పష్టం.

రష్యాపై హిట్లరు దండయాత్రతో ప్రజాయుద్ధదశ ప్రారంభమయింది. 1941 డిశంబరు 7 న జపాన్ యుద్ధం ప్రకటించాక, భారతదేశానికి ఫాసిస్టు దురాక్రమణ ప్రమాదము వచ్చింది. తమ మాతృదేశ రక్షణకొరకు కమ్యూనిస్టులు నడుం బిగించారు. ఫాసిజానికి వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టులు. అగ్రగాములనుట జగద్విదితం. ప్రజా ఒత్తిడి కమ్యూనిస్టులను క్రమంగా నిర్బంధాలనుండి విడుదలచేయించగలిగింది. 1942 జూన్‌లో కమ్యూనిస్టు డిటెన్యూలు విడుదలచేయబడ్డారు. వెంటనే కమ్యూనిస్టు రైతు నాయకులు తమ తమ జిల్లాలలో రైతు ఉద్యమాన్ని పునరుద్ధరించడానికి పూనుకున్నారు. ఇది రంగా గ్రూపుకు కంటకంగా కన్పించింది. తూర్పు, పశ్చిమ గోదావరులలో రైతు వుద్యమంతో సంబంధం లేనివారు ఆర్గనైజర్లుగా నియమించబడ్డారు. కమ్యూనిస్టులు యిందుకు అసమ్మతి తెలిపారు. కాని రైతు వుద్యమ శ్రేయస్సుకొరకు, ఐక్యతను కాపాడటానికి, వారిక్రిందనే పనిచేయడానికి పూనుకున్నారు. ఆర్గనైజర్లను సభ్యత్వ పుస్తకాలు తెప్పించమని కోరారు. కాని యెన్ని జాబులు వ్రాసినా రాష్ట్ర రైతుసంఘం సభ్యత్వ పుస్తకాలు పంపలేదు. విసికి వేసారి అఖిల భారత కిసాన్ సభకు అప్పీలు చేయసాగారు. కమ్యూనిస్టులు ఆఫీసులో వున్న కృష్ణాజిల్లా రైతుసంఘంకూడ సభ్యత్వ పుస్తకాలకు వ్రాసింది. రాష్ట్ర రైతుసంఘ అధ్యక్షుడు కాలయాపనం చేయసాగాడు. చివరకు ఈ సంవత్సరంలో సభ్యత్వం చేర్పించడం ఆపుచేయాలని తామభిప్రాయ పడుతున్నామని తెలిపారు. దీనిపై కృష్ణాజిల్లా రైతు సంఘం అఖిల భారత కిసాన్ సభకు అప్పీలు చేసింది. కార్యదర్శి స్వామి సహజానంద రాష్ట్ర రైతు సంఘానికి తనకు వచ్చిన కంప్లయింటులు తెలుపుతూ సభ్యత్వ పుస్తకాలు పంపమని ఒత్తిడితెచ్చాడు. కృష్ణాజిల్లా రైతు సంఘానికి రాష్ట్ర ఆఫీసు వెంటనే అందజేయలేకపోయినచో అచ్చువేయించుకోవచ్చు నని అనుమతి యిచ్చాడు.

రైతుసంఘ సభ్యులను చేర్పించే గడువు డిశంబరు 31 తో అంతమవుతుంది. అందుచే అన్ని జిల్లాలనుండి కమ్యూనిస్టులు సభ్యత్వ పుస్తకాలకు తొందర జేస్తున్నారు. అఖిలభారత కిసాన్ సభ అధ్యక్ష, కార్యదర్శులు సభ్యత్వ పుస్తకాలు అందరికి యివ్వమని ఒత్తిడి చేస్తున్నారు. ఈ పరిస్థితులలో సమావేశమయిన ఆంధ్ర రాష్ట్ర రైతు వర్కింగ్ కమిటీలో అధికారంలో వున్న రంగ ముఠా, పై విధంగా తీర్మానించింది. సభ్యత్వం చేర్పించి, యెన్నికలు జరిగితే, రాష్ట్ర రైతు సంఘము తమ ఆధీనం తప్పిపోతుందనే భయంతో రంగా గ్రూపు యీ యేడాది సభ్యత్వమే చేర్పించ నిరాకరించింది. అందుకు అఖిల భారత కిసాన్ సభ ఒత్తిడి చేస్తే దానితో రాష్ట్ర రైతుసంఘం సంబంధం తెంచుకోవాలని తీర్మానించారు. రైతుసంఘం సక్రమంగా పనిజేస్తే తమ చేతులలో నుంచి పోతుందనే భీతితో రైతు సంఘాన్నే రద్దుచేసి యేజంటును నియమించారు. ఇదీ అసలు రహస్యం!

దీనిని కప్పిపుచ్చడానికి పౌరసత్వహక్కులు లేకపోవడాన్ని, జాతీయ సంక్షోభాన్ని సాకుగా ఉపయోగించారు. తీవ్రవాదుల పంథాతో రైతుసంఘాన్ని రద్దు చేసారనీ, నిర్బంధవిధానానికి వ్యతిరేకంగా అది ఆయుధధారణ అనీ, ప్రజ లనుకోవాలని రంగా ముఠావారు ఆశించుతున్నారు. వాస్తవికంగా ఆలోచించితే ఇది ఆయుధ ధారణ కాదు: అస్త్రసన్యాసం. రైతాంగం యుద్ధపరిస్థితులవలన అనేక యిబ్బందులు పడుతూంది. వస్తువుల ఖరీదులు విపరీతంగా పెరిగాయి. కిరసనాయిల్ వగైరా రైతులకు దొరకుటే కష్టమవుతోంది. రాయలసీమలో కరువు జ్వాలలు వ్యాపించాయి. ఇలాంటి సమయంలో రైతుసంఘాలు ఎంతో కృషిచేయవలసివుంది. రైతుల కష్టాలను నివారణ చేయాలి. ప్రభుత్వోద్యోగుల నిర్బంధాలనుండి వారిని కాపాడాలి. ఎక్కువగా పండించడానికి సలహాలు, ఉత్సాహము యిచ్చి దేశాన్ని ఆహారపదార్థాల కరువునుండి కాపాడాలి. ఇలాంటి సమయంలో రైతుసంఘాలను రద్దుచేయడానికి రంగా ముఠా పూనుకుందంటే, యిది తమ కర్తవ్యాన్నుంచి పారిపోవడం. అస్త్రసన్యాసం గావించడం గాకపోతే మరేమిటి?

ప్రభుత్వం నిషేధించినపుడు సైతం విప్లవకారులు రహస్య జీవితాన్ని గడుపుతూకూడ ప్రజాసేవ చేస్తారు. 1934 లో నిషేధించబడిన కమ్యూనిస్టుపార్టీ 1942లో నిషేధం తొలగించబడేవరకూ రహస్యంగా నిర్మాణాన్ని కొనసాగించింది. ప్రజాసేవ చేయడంద్వారా పార్టీ బలపడింది. బహిరంగంగా పనిచేసే అవకాశాన్ని సంపాదించింది. కాని రంగాముఠావారు తామే కోరి రైతుసంఘాన్ని రద్దుచేస్తూతీర్మానించారు. ఇంతకంటే రైతుసంఘాలకు ఆత్మహత్యాకరమైన తీర్మానం వుండబోదు.

ఆంధ్రదేశంలో రైతు వుద్యమాభిలాషులకు మా మనవి యేమంటే, ఆంధ్ర రైతు వుద్యమాన్ని యీ విధ్వంసక ప్రయత్నాలనుంచి కాపాడండి. అనేకమంది రైతు సేవకుల త్యాగ ఫలితంగా నిర్మించబడి అఖిలభారత కిసాన్ సభకు ఒక శాఖగా ప్రకాశించిన ఆంధ్ర రైతు ఉద్యమాన్ని, దాని జెండాను, యెప్పటివలె దేదీప్యమానంగా కొనసాగించుటకు ప్రతినబూనండి. రైతు వుద్యమాన్ని చీల్చడం, యీ క్లిష్ట సమయంలో రైతుసంఘాన్ని రద్దుచేయడం, రైతాంగ శ్రేయస్సుకు భంగకరమని యెలుగెత్తి చాటండి.

రైతుసంఘంలో చీలికలా!

కృష్ణాజిల్లా రైతుసంఘ అధ్యక్ష, కార్యదర్శుల ప్రకటన.

రైతుసంఘములో రాజకీయ అభిప్రాయ భేదములు కలవారు వున్నప్పటికి అఖిలభారత రైతుసంఘ కార్యక్రమమును అమలు జరుపుచున్నారు. రైతులకు సంబంధించిన కార్యక్రమములో వారి దైనందిన కష్ట పరంపరలను సాధించుట, తోడ్పడుటలోను, పై సంఘముల వుత్తర్వులను పాటించి క్రమం తప్పక పని చేయుటలో రాజకీయ అభిప్రాయములు గనేమీ అడ్డు రాలేదు. 12-5-42 ఒంగోలులో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర రైతు సంఘమువారి రాజకీయ అభిప్రాయముతో కొన్ని జిల్లా సంఘముల ప్రతినిధులు వ్యతిరేకించినారు. అయినప్పటికి ఆ జిల్లాలు రైతు సంఘ కార్యక్రమమును అమలు జరుపుతూ పనిచేయుచున్నారు.

ఒంగోలులో జరిగిన రాష్ట్ర రైతుసంఘ సభలో జనరల్‌బాడీకివున్న అధికారాలను కార్యవర్గమువారికి అప్పగించుట జరిగింది. యీ తీర్మానముమీద చాల తర్జనభర్జనలు జరిగినవి. కృష్ణా, నెల్లూరు, కర్నూలుజిల్లాల ప్రతినిధులు యీ తీర్మానమును తీవ్రముగా ఎదిరించినారు. పని కుంటుబడకుండా జరుగుటకు మాత్రమే ఆ తీర్మానము వుద్దేసించబడినది, రాష్ట్ర రైతు సంఘ నిబంధనావళిని మార్చుటకు, రైతు సంఘమును రద్దుచేయుటకు, ఏజెంటును నియమించుటకు, కార్య (మిగతా 9 వ పేజీలో)

భారత స్వాతంత్ర్యం పేరిట

లెనిన్ డే (1943 జనవరి 21) లోపల రెండు లక్షల పార్టీఫండు పోగుచేయాలని సెంట్రల్ కమిటీయొక్క విస్తృతసమావేశం తీర్మానించింది. పార్టీ రహస్యజీవనపు దినాలలో యాదృచ్ఛికంగా పార్టీ మెంబర్లు, సన్నిహిత సానుభూతిపరులు ఇచ్చినదే మాపార్టీనిధి. పందుకోసం ఆరోజులలో పార్టీ పేరిట విజ్ఞప్తి చేయలేక పోయాం. అప్పుడు పార్టీకి విరాళాలిస్తే నేరం చేయడం అన్నమాట.

స్వాతంత్ర్యం కావాలనే ప్రజలఅమర వాంఛ యుండే. కమ్యూనిస్టు పార్టీ ఉద్భవించింది. లెనిన్ నాయకత్వంక్రింద, విప్లవ బోల్షివిక్ పార్టీ ఆర్గానిజేషన్ ద్వారా, జారు ప్రభువుల దాస్యంనుండి సోషలిస్టు స్వాతంత్ర్యానికి విజయవంతంగా దారితీసిన రష్యను ప్రజలను అనుసరించుటకోస్నే, మన ప్రజలభవిష్యత్తుకు, మన దేశ స్వాతంత్ర్యానికి, మార్గమున్నదని మన విశాల జాతీయోద్యమంలో తమ రాజకీయ అనుభవంవల్లను, ఆచరణ ద్వారాను తెలిసికొన్న దేశభక్తులచేతనే పార్టీ నిర్మించబడింది

అమర లెనిన్ చే పునాది వేయబడిన లెనిన్ శిష్యుడు, వాని అనుచరుడూ ఐన స్టాలిన్ మహానాయకునిచేనడపబడే విశ్వవ్యాపిత కమ్యూనిస్టు భ్రాతృత్వ చిహ్నమైన - అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీకి శాఖయే మా పార్టీ.

ముజఫిర్ అహ్మద్, డాంగేప్రభృతులు, మాపార్టీ సంస్థాపకులు. సోషలిజమే తమ సిద్ధాంతంగా జేసికొని, వారు కార్మికలోకంలో చొచ్చుకుపోయి పని చేశారు. కార్మికవర్గాన్ని సంఘటిత పరచడానికి, జాతీయ ఉద్యమంలో దాని పాత్రను నిర్వహించడానికి చాలాపాటుబడ్డారు. ఏ సంఘంలోనైనా, ఏదేశంలోనైనా కార్మికవర్గం తక్కిన అన్నివర్గాలకన్నా విప్లవకారి ఐనట్టిది అట్టి వర్గాన్ని సంఘటితపరచి, ఉద్రేక పరస్తూన్న వీరి కృషి చూసి సామ్రాజ్య ప్రభుత్వం తన ఉనికికే మోసం వచ్చిందని భయపడింది. ఎన్నివిధాల అడ్డు తగలాలో అన్నివిధాల అడ్డుతగిలింది, మన ప్రజలకు ప్రబోధించడానికి, సంఘటిత పరచడానికి అడ్డు తగిలారు. పార్టీ ఏక్షణంలో పుట్టిందో, ఆక్షణంనుంచి నిర్బంధం ప్రారంభమైంది. ఇంతవఱకు ఆగలేదు, ఏన్నోకుట్ర కేసులు బనాయించింది. రెండు అఖిలభారత కుట్రకేసులు, ఎన్నోరాష్ట్ర కుట్రకేసులు, పెట్టింది. ఎంతోమంది నాయకులు తమ సగం జీవితం జైళ్ళలోనే గడిపారు పార్టీమెంబర్లలో అధికంమంది ఏ ఒక్కసారైనా జైలు రుచి చూచిఉంటారు.

15 సంవత్సరాల సామ్రాజ్య దౌర్జన్యం మా పార్టీని చిన్నాభిన్నం గావించలేకపోయింది. దీనికిమారు మా పార్టీ దిన దినాభివృద్ధి గాంచింది. 8 సంవత్సరాల రహస్యజీవనం పిమ్మట ఏ ప్రభుత్వమైతే మమ్మల్ని అక్రమ సంఘంగా చేసిందో ఆ ప్రభుత్వమే మా పార్టీపై నిషేధం తొలగించింది.

అన్ని ప్రతిబంధకాలనూ ఎదుర్కొని, దేశంలో ట్రేడు యూనియన్ ఉద్యమాన్ని నిర్మించాం. పరిశ్రమ కేంద్రాల్లో మామున్న సభ్యత్వంలో అధికులు కార్మికులు. సమ్మె పోరాటంలో యజమాన్లను పోలీసులను నిగ్రహించి, నిగ్గుదేరి, పోటీలేని కార్మిక నాయకులైనది మా కార్మిక మెంబర్లే.

ఎఱ్ఱజెండాను గ్రామాలలో ఎగురవేశాం. కాంగ్రెసువల్ల జాతీయచైతన్యం, కార్మికోద్యమంవల్ల వర్గచైతన్యం కల్గిన రైతులతో రైతు సంఘాలను స్థాపించాం. వ్యవసాయక రాష్ట్రాలైన పంజాబు, బీహారు, ఒరిస్సా, ఆంధ్ర, కేరళాలలో మామున్న పార్టీ మెంబర్లలో అధికసంఖ్య రైతుయువకులే తమ సంఘాలను నిర్మించడానికి రైతులకు మా పార్టీసహాయంజేస్తే. రైతులు తమ బిడ్డలను మా పార్టీకి, పార్టీని ఆర్గనైజు చేసుకొనేందుకు, ప్రతిఫలంగా అప్పజెప్పారు.

కార్మిక కర్షకుల విజృంభణ మధ్యతరగతి వారిని, అందులోనూ అగ్రగాములైన విద్యార్థులను, మేల్కొలిపింది సంఘంలోని వివిధ వర్గాలను వారివారి కోర్కెలపై జాతీయోద్యమంలో లీనమయ్యేభాగంగా, సంఘటితపరచే పార్టీయని మా నాయకత్వం సలహాలకోసం, విద్యార్థులు ఎదురుజూచారు విద్యార్థులు తమ ఉద్యమాన్ని నిర్మించుకోవడంలో మేము తోడ్పడ్డాం. మంచి స్టూడెంటు వర్కర్లంతా మా పార్టీలో చేరారు.

కార్మికులలోను, కర్షకులలోను, విద్యార్థులలోను, ఈ విధంగా పాటుబడ్డాం. అదే విధంగా కాంగ్రెసును భారత ప్రజలయొక్క జాతీయ సంస్థగా చేయడానికి కృషిజేశాం. దాని ఫలితంగా మేము ఒక రాజకీయ శక్తిగా వృద్ధిపొందాం. మేమంతా కాంగ్రెసులో చేరాం; వందలకొలది కాంగ్రెసువాదులు మా పతాకంచుట్టు చేరారు. పరిశ్రమ కేంద్రాల్లో తప్ప, దాదాపు అన్ని రాష్ట్రాలలోనువున్న మా పార్టీమెంబర్లలో చాలామంది ఇదివఱకే పేరు ప్రఖ్యాతులుగన్న కాంగ్రెసు నాయకులు.

భారతదేశంలో విప్లవకారుల మొట్టమొదటి తరానికిచెందిన గురుముఖసింగు, వాసఖసింగు, రూపుసింగు మొదలైనవారు ఎఱ్ఱజెండాపొంతకు జేరారు. వారి అడుగు జాడలనే భగతసింగు జట్టువారు, అండమాను ఖైదీలు, చిటగాంగు వీరులు. ఈ యీ ముఠాలకు చెందిన వారిలో పెక్కుమంది, ఒకరివెంబడి ఒకరు, ఒకే ఒక నిజమైన విప్లవపార్టీఐన కమ్యూనిస్టుపార్టీలోనికి వచ్చారు.

సామ్యవాద సిద్ధాంతాలపై నిలబడి, దేశభక్తి పూరితమై, విప్లవ మార్గాన్ని అనుసరించే కార్మిక వర్గపు పార్టీమాది. 15 సం॥రాల ఎడతెరపిలేని స్వాతంత్ర్య పోరాటపు ఫలితంగా కార్మికులలోను, కర్షకులలోను, **విద్యార్థులలోను ప్రథమశ్రేణికి చెందినవారు మా** పార్టీలో చేరారు. అటువంటి పార్టీ చేరడం చాలా గర్వించవలసిన విషయం. మాపార్టీలో చేరడం సులభంగాదు. పార్టీ మెంబర్లు సోషలిస్టు సిద్ధాంతాలపై ప్రబల నమ్మకం ఉంచాలి; వారు ప్రజలలోకి చొచ్చుకుపోయి ఎడతెగకుండా పని చేయాలి; వారు మిక్కిలి కఠినమైన శిక్షణకు లోబడి ఉండాలి కాని, ప్రతిభారతీ**యుడు మాపార్టీకిసహాయంచేయవచ్చు. అందులో విరాళా లివ్వడం ఒకటి. అలా జేస్తే భారతస్వాతంత్ర్యానికి పోరాటుసల్పే, మిక్కిలి సుశిక్షితమైన సైన్యానికిసహాయం చేయడం అవుతుంది.**

2 లక్షల నిధికి

సహాయంకోసం మేము విజ్ఞప్తి చేస్తున్నామంటే, ఇదివరకు మేం గడించిన విజయాలే గాదు ఆధారం. నిజమైన జాతీయపంథాఐనట్టి, ప్రజా సమీకరణ గావించేటట్టి, మా ప్రస్తుత రాజకీయ విధానంబట్టికూడా విజ్ఞప్తిచేస్తున్నాం.

దేశ వ్యాపితమైన ప్రజా ఉద్యమం ద్వారా కాంగ్రెసు నాయకులను విడిపించి, జాతీయ సమస్యా పరిష్కారానికి పూనుకున్నది కమ్యూనిస్టుపార్టీ.

జాతీయ ప్రభుత్వానికి జాతీయ ఐక్యత అవసరం. అట్టి ఐక్యతా నిర్మాణానికి కాంగ్రెసు లీగు ఒడంబడిక ఆధారం. ఈ ఒడంబడికను సాధించడానికి, కమ్యూనిస్టుపార్టీ హిందూ ముస్లిం ప్రజాసామాన్యాన్ని ఐక్యపరచడానికి, ఒక బ్రహ్మాండమైన ఐక్యతా ఉద్యమం లేవదీసింది.

ప్రతిసభ్యుడు ప్రాణమున్నంతవరకు ఫాసిస్టు దురాక్రమణ దారులను ఎదు

కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి

ర్కొంటాడని కమ్యూనిస్టుపార్టీ ప్రతిజ్ఞ చేసింది.

భారత స్వాతంత్ర్యానికి సంయుక్త ప్రజాశక్తిపై ఆధారపడి జాతీయ ఐక్యత ద్వారా బ్రిటీషుప్రభుత్వాన్ని ఎదిరించి జాతీయ ప్రభుత్వాన్ని సంపాదిస్తుంది. జాతీయ ఐక్యతద్వారా జాతీయ ప్రతిఘటనను నిర్మించి ఫాసిస్టు దురాక్రమణను నిరోధిస్తుంది.

ఇదిమనదేశానికి గొప్పప్రమాద సమయం. కాని, ఇది మన స్వాతంత్ర్యానికి గొప్ప అదును కూడా. ఇప్పుడు దేశభక్తులైనవారు పెడ మార్గాలను పట్టితే విధ్వంసక చర్యలు ఇంకాసాగించితే, మనదేశం జపాను అరికాలు కిందుకు తప్పకపోతుంది. బ్రిటీషు సామ్రాజ్యవాదులు మనమాటలు వింటంలేదనే కోపంమీద మన గొంతును మనమే కోసుకోకూడదు. అంత్యకాలం సమీపించిన ప్రతిసామ్రాజ్య ప్రభుత్వం ఈలాగే చేస్తుంది. రాజకీయనాయకులు అరెస్టువలన గ్రుడ్డి ఉద్రేకంతో చాలామంది దేశభక్తులు, దురాక్రమణదారులు పొంచియున్న ఈసమయాన చేయరానిపనులు చేస్తుండడం జూచి మనం నిస్పృహ చెందకూడదు. మన క్షేమాలను రక్షించుకోడానికి మనశక్తిపైనే **40 కోట్ల భారతీయుల ప్రబల ఐక్యత**పైనే ఆధారపడుదాం. మననాయకులను విడిపించడానికి అందఱు దేశభక్తులూ ఏకముపుదాం! జాతీయ ప్రభుత్వానికై కాంగ్రెసు లీగులను ఐక్యపరచుదాం! జపాను ముండగీయులను ఎదిరించడానికి 40 కోట్ల భారతీయులను ఐక్యపరచుదాం! మన సంయుక్తశక్తి అప్రతిహతం!

ఇదే మావిజ్ఞప్తి. ఆచరణ యోగ్యమైన దేశభక్తి పూరితమైన పాలసీకి ప్రతిబింబమే మా విజ్ఞప్తి. కాంగ్రెసు నాయకులు విడుదల అయేదాక కాంగ్రెసులీగు ఒడంబడిక జరిగేదాక, జాతీయ ప్రభుత్వం సంపాదించేదాక, జాతీయఐక్యతా ఉద్యమం కొనసాగుతూనే ఉంటుంది.

ఐక్యతా ఉద్యమంలోకి ప్రతి పార్టీ సభ్యుని, ప్రతి యాక్టివ్ సపోర్టరును దించుతాం. ఈ ఉద్యమానికి మనుష్యులేగాదు కావలిసింది, మేము ఇదివరకుఖర్చుపెట్టిన దానికంటె ఎంతో అధికంగా ధనం కావాలి.

మాపార్టీకన్న మితవ్యయంచేసే మరోపార్టీ ఏదీలేదు. పార్టీ ఇచ్చే జీవితభృతి ఎన్నడూ నెలకు 25 రూపాయలకు మించలేదు.

పేపరు ఖరీదు 100 కి 800 చొప్పున పెరిగింది. "కరపత్రాలు, ప్రణాళికలు, పోస్టర్లు" అచ్చు ఖరీదు మితిమీరిపోయింది. ఇదివరకు అచ్చు వేయించే సంఖ్యకు ఇప్పటి సంఖ్యకూ హస్తిమశకాంతరం తేడావుంది. సెంట్రల్ కమిటి సమావేశం నిర్ణయించిన కోటాలను దాటిపోయినాయి. నవంబరుతో పూర్తి కావలసిన 5000 కోటాను ఆంధ్ర, మలబారు పత్రికలు అక్టోబరు ఆఖరుకే పూర్తి చేయడమే కాకుండా, కోటానుదాటిపోయాయి. బెంగాలు, మలబారు పార్టీలు దినపత్రికలను నడుపుటకు ప్లానులు వేస్తున్నారు. రెండు వారాలలోనే యింగ్లీషు పీపుల్సువార్ పత్రిక 10,000 నుండి 15,000 కు పెరిగి పోయింది.

అంతేగాదు, పత్రికలు ఎక్కువ అమ్మడుపోవటం ఎక్కువ ధననష్టమే కాని ప్రక్కనే రాజకీయంగా ఎంతోలాభం పొందుతాం. పార్టీ, దాని సానుభూతిపరులు కావలసినంత కాగితాన్ని ఎప్పుడైనా కొనటానికి ధనాన్ని సేకరించాలి.

ఒక జిల్లానుండి మరొకచోటికి, ఒకరాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి వందలకొలది పార్టీ ఆర్గనైజర్లు జాతీయైక్యతా ప్రచారార్థం తిరుగుతున్నారు. ప్రచారం నిమిత్తం మన మెన్నడూ వ్యయపరచనంతధనం ఖర్చుపెట్టుచున్నాం.

కేంద్ర, రాష్ట్ర ఆఫీసులలో కామ్రేడ్సును ప్రచారకులుగా, ఆర్గనైజర్లుగా తయారుచేయుటకు అధ్యయన తరగతులు విరివిగా నడుపబడుచున్నవి.

జాతీయైక్యతా ఆందోళన, ప్రచారం మన మాతృభూమి సంరక్షణకు పునాది. మన మాతృభూమిని, మన స్వాతంత్ర్యాన్ని భారత దేశ గౌరవాన్ని నిలబెట్టుకొనేందుకు చేయబోయే సంగ్రామంలో, యిది మొదటి అధ్యాయంగాతలచి ప్రతికామ్రేడ్ పనిచేయాలని మేము కోరుచున్నాం. దేశప్రజలను దేశరక్షణకు పూనుకునేటట్లు చేయుటకు దేశంలో ఐక్యత ఏర్పడేందుకు మన విప్లవపార్టీకి తగిన హోదాలో జాతీయైక్యతా (మిగతా 9 వ పేజీలో)

రాజాజీ రాయబారాలకు వైస్రాయి ఆటంక మెందుకు?

కామ్రేడ్
కంభంపాటి సత్యనారాయణ

వైస్రాయి దృష్టిలో రాజాజీ ఏపార్టీకిగాని, ఏ సంస్థకు గాని, ప్రాతినిధ్యం వహించడు: అతడు చేసిన సూచనలకు దేశంలో సంపూర్ణమైన ఆమోదం లేదు: కాబట్టి జైలులో వున్న గాంధీజీని అతడు సందర్శించకూడదు.

కాని, యీమధ్యనే డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ హిందూ మహాసభతరపున మహాత్ముని సందర్శించడాని కనుమతి అడిగితే, వైస్రాయి నిరాకరించాడు. దీన్నిబట్టి, పార్టీ ప్రాతినిధ్యంతో గాంధీజీని సందర్శించే అర్హత వస్తుందనడానికి వీల్లేదు. రాజాజీయొక్క సూచనలకు దేశంలో ఎంత ఆమోదం ఉన్నదనే విషయాన్ని గురించి తనకూ, వైస్రాయికీ, మధ్య చర్చ జరుగనేలేదని రాజాజీ జవాబిచ్చాడు. అట్టిప్రశ్న బయల్దేరివుంటే, సంతోషపూర్వకంగా తాను చర్చించి యుండేవాణ్ణి అని తెలియజేశాడు. అబద్ధాలపై ఆధారపడవలసిన నీచ స్థితికి వచ్చారు నేడు సామ్రాజ్యవాదులు.

ఒడంబడికకు అవకాశాలు

నేడు సంపూర్ణమైన జాతీయైక్యతకు పునాది కాంగ్రెసు-ముస్లింలీగ్ ఒడంబడిక. దీనికి యీరోజున చక్కనిఅవకాశాలున్నాయి. "మేమిద్దరం (జిన్నా-రాజాజీ) చాలాదగ్గరలో వున్నాం. ఒకచిన్నవిషయం పరిష్కారమైతే, ఒడంబడిక కుదురుతుంది." అని రాజాజీ చేసిన ప్రకటన యిందుకు తార్కాణం. కాని, వైస్రాయి ఇట్టి అవకాశాన్ని నిరాకరించాడు దీన్నిబట్టి ఒడంబడిక కుదరకుండా చేయడమే ప్రభుత్వోద్దేశమని స్పష్ట మవుతూంది.

కాంగ్రెసునాయకుల వైఖరిలో ఎట్టి మార్పు కనబడడం లేదనీ, తామనుసరించిన విధానానికి విచారం తెలియజేయలేదనీ, ప్రభుత్వ ప్రకటన చెపుతోంది. కాని, సామ్రాజ్యవాదులే మొదట కాంగ్రెసు నాయకుల్ని నిర్బంధించి దేశంలో అశాంతిని రగుల్కొలిపారు. దీనికి పశ్చాత్తాపాన్ని ప్రకటించవలసిన వారు సామ్రాజ్యవాదులేగాని, కాంగ్రెసు నాయకులు కాదు. వారి వైఖరి మారిందో లేదో వైస్రాయి కేమితెలుసు? ఒకవేళ మారలేదనే అనుకుందాం. రాజాజీవంటి మధ్యవర్తులు దేశంలో యేర్పడిన దుష్ఫలితాలను గాంధీజీకి స్పష్టంగా తెలియజేసి, వారి వైఖరిని మార్చియుండేవారేమో! అట్టి అవకాశాన్ని నిరాకరించిన వైస్రాయి మనదేశంతో చెలగాటా లాడుతున్నాడు.

రాజాజీ ఖండన; ముస్లింపత్రికల వ్యాఖ్యలు

వైస్రాయి చర్యను రాజాజీ తీవ్రంగా ఖండిస్తూ, "మిత్రరాజ్యాలతో ఐక్య భారతదేశం సహకారం చేయకుండా ఆటంకాన్ని కల్పించాడ"ని ఖచ్చితంగా తెలియజేశాడు. హిందువులు గాని, మహమ్మదీయులుగాని, బ్రిటిష్ ప్రభుత్వ వచనాలను యిక నమ్మరని చెప్పాడు. రాజీకిగల అవకాశాలన్నీ, ప్రస్తుతం, నాశనమయాయన్నాడు. ముస్లింలీగ్‌పత్రిక "డాన్" తన సంపాదకీయంలో, రాజాజీయొక్క కోరికకు ప్రజాభిప్రాయం అనుకూలంగా వున్నదనీ, జిన్నా - రాజాజీల మధ్య జరిగిన సంభాషణల్ని గురించి గాంధీజీకి తెలియపరిస్తే, ఉపయోగం ఉండేదనీ, వ్రాసింది. భారతదేశంలో రాజకీయ ప్రతిష్టంభన అంతం కావాలని కోరేవారందరూ వైస్రాయి యీ చక్కని అవకాశాన్ని జారవిడిచినందుకు విచారిస్తున్నారని "స్టార్ ఆఫ్ ఇండియా" పత్రిక వ్రాసింది. "ఖిలాఫత్" అనే సుప్రసిద్ధ ముస్లిం దినపత్రిక వైస్రాయి చేసిన యీ "పెద్ద పొరబాటు"కు ఆందోళన తెలియపరచింది. "స్టేట్సుమన్" వంటి యూరపియన్ పత్రిక సహితం యిలా వ్రాసింది, "రాజీ కుదర్చడంలో రాజాజీకంటే యెక్కువ సమర్థుడు ప్రస్తుతం కనపడ్డంలేదు. అట్టివానికి అనుమతి నీయకపోవడం పొరబాటని దేశం భావిస్తుంది."

చర్చిల్‌యొక్క ఉపన్యాసం

ఇటీవల బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ఒకలండన్ సభలో వుపన్యసిస్తూ, "బ్రిటిష్ సామ్రాజ్యం నాశనమవడానికికాదు, నేను ప్రధానమంత్రిగా ఉన్నది. అందుకు మరొకవ్యక్తి పుట్టాలి." చర్చిల్ వెల్లడించిన యీ సామ్రాజ్యకాంక్షను ఇక్కడ వైస్రాయి ఆచరణలో పెడుతున్నాడు. మన దేశంలో జాతీయైక్యత లేకపోవడమే సామ్రాజ్యవాదులకు నేడు గల బలం. ఐక్యత కుదరకుండా చేయడమే వారిమార్గం. కనుకనే వైస్రాయి రాజీ అవకాశాన్ని నిరాకరించాడు.

ముస్లింలీగ్ వైఖరి

ఈనెల 9 వ తేదీని సమావేశమైన అఖిలభారత ముస్లింలీగ్ కౌన్సిల్‌లో జిన్నా ప్రభుత్వవిధానాన్ని తీవ్రంగా ఖండించాడు. ఈ 150 సంవత్సరాల నుంచీ దేశంలో పరిపాలిస్తూన్న బ్రిటిష్ ప్రభుత్వం ప్రజల ఆమోదంతో యేర్పడినది కాదనీ, బ్రిటిష్ ఫిరంగులతోను, తుపాకులతోను, జబర్దస్తీగా యేర్పడిన ప్రభుత్వమనీ, వెల్లడించాడు. మహమ్మదీయు లధిక సంఖ్యగా వున్న ప్రదేశములలో వారి స్వయంనిర్ణయ హక్కును అన్ని రాజకీయపార్టీలు గుర్తించాలని తెలియజేశాడు. అయితే స్వతంత్ర భారతదేశంలోనే పాకిస్థాన్ సాధ్యమవుతుందని జిన్నా గుర్తించాడు. "మిత్రభావంతో ఉభయ పార్టీలవారం సమావేశమై, ఉభయులకూ న్యాయం కలిగే విధానం ఆలోచించడ మవసర" మన్నాడు. ఫాసిస్టుప్రమాదం దేశాన్ని ఆవరించిన యీ విషమపరిస్థితులలో బ్రిటిష్‌ప్రభుత్వ మవలంబిస్తూన్న వైఖరి యెంతో హానికరమని హెచ్చరించాడు.

కాంగ్రెసు-లీగ్ ఒడంబడికకు జిన్నా యేచర్య అవసరమని భావిస్తే ఆ చర్య తీసుకునే అధికార మతనికి యిస్తూ లీగ్ వర్కింగుకమిటీ యిదివరలో తీర్మానించింది. దానినే యిపుడు లీగ్ కౌన్సిల్‌కూడా ఆమోదించింది. రాజాజీవంటి మధ్యవర్తుల ప్రయత్నాలకు జిన్నా సహకారం చేయవచ్చునని కూడా తీర్మానంలో వుంది. అంటే, రాజాజీకి ముస్లింలీగ్ యొక్క ఆమోదం లభించిందన్నమాట.

మరొక నిమ్నజాతుల సమస్య!

ఒకవేళ రాజాజీ ప్రయత్నాలు సఫలమైతే, మరొకకొత్త సమస్యను సామ్రాజ్యవాదులు ముందుకు తీసుకొచ్చేటట్లు కన్పిస్తోంది. ప్రభుత్వసభ్యుడైన డాక్టరు అంబేద్కర్ ఒక బొంబాయి సభలో యీవిధంగా ఉపన్యసించాడు: "కాంగ్రెసువాదులు ముస్లింలీగ్ వెనుక పరుగులెత్తుతున్నారు. వారు నిమ్నజాతుల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. కారణం, తగినంత నిర్మాణయుక్తంగా మనం పని చేయడంలేదు. కనుకనే, యితరులు మన కోర్కెలనామోదించేటట్లు నిర్బంధించలేకున్నాం" అంటే ప్రభుత్వసహాయంతో వారిని నిర్బంధించాలనేగా! నిమ్నజాతుల ఫెడరేషన్ అధ్యక్షుడైన రావుసాహెబ్ శివరాజ్ కూడా యీ ధోరణిలోనే ఒక ప్రకటన గావించాడు.

అజాద్ ముస్లింబోర్డు వైఖరి

భారతీయులందరూ హిందూ-మహమ్మదీయ సమస్యా పరిష్కారానికి దేశంలో తీవ్రంగా ఆందోళన చేయవలసిందనీ, ముఖ్యంగా మహమ్మదీయులు భారతస్వాతంత్ర్యాన్ని బ్రిటిషు ప్రభుత్వం గుర్తించేటట్లు బలమైన ఒత్తిడి తీసుకురావలసిందనీ, అజాద్ ముస్లింబోర్డు హెచ్చరించింది. ఇట్టి హెచ్చరికనే బ్రిటన్-అమెరికా-రష్యా ప్రజలకు కూడా చేసింది. ఈ విధంగా, ప్రస్తుత పరిస్థితులలో యీ సమస్య ప్రజాందోళన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అజాద్ ముస్లింబోర్డు సరియైన పంథాలో ఆలోచిస్తోంది.

నిర్బంధ విధానం : అరాజకోద్యమం

సామ్రాజ్యవాదులు జాతీయైక్యతకు ఆటంకాలు కల్పించడమేగాక, నిర్బంధవిధానాన్ని యెక్కువచేస్తున్నారు. ప్రస్తుతపు అరాజక చర్యలలోపాల్గొని చీమూర్ (మధ్యపరగణాలు) ప్రభుత్వోద్యోగుల్ని, హత్యగావించినందుకు 29 మందికి ఉరిశిక్ష విధించబడింది. ఢెన్‌కనాల్ సంస్థానంలో ముగ్గురికి ఉరిశిక్ష విధించబడింది. అహమ్మదాబాద్ నయాగడా, మొదలైన ప్రదేశాలలో పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చారు. బీహార్ రాష్ట్రంలో సాముదాయిక జరిమానాలకు హద్దులేకుండా పోతూంది. బొంబాయి ప్రభుత్వం అ. భా. కాం. కమిటీయొక్క 11 లక్షల రూపాయల ఆస్తిని స్వాధీనం చేసుకుంది. ప్రజలీ నిర్బంధవిధానానికి లొంగక, విధ్వంస క్రియలకు పూనుకొంటున్నారు. కరాచీ, బొంబాయి, అహమ్మదాబాద్, సూరత్ మొదలైన పట్టణాలలో బాంబులద్వారా బ్రిటిష్ ప్రభుత్వాన్ని స్తంభింపజేయ చూస్తున్నారు. బర్మాకు సరిహద్దులోవున్న అస్సాం ప్రజలు సహితం తమ చర్యల ఫలితమెంత హానికరమో గుర్తించకుండా, ఇన్‌స్పెక్షన్ బంగాళాలు పోస్టాఫీసులు, పి. డబ్లియు. డి. బంగాళాలు, తగులపెడుతున్నారు. సామ్రాజ్యవాదుల నిర్బంధవిధానం, క్రోధోన్మత్తుల అరాజక చర్యలుచూచి జపాన్‌హంతకులు సంతోషిస్తున్నారు.

బ్రిటిష్‌ప్రజలకు బహిరంగ లేఖ

"లైఫ్" అనే సుప్రసిద్ధ అమెరికన్ పత్రిక యిటీవల బ్రిటిషు ప్రజల కొక బహిరంగ లేఖను ప్రకటిస్తూ, అందులో యిలా వ్రాసింది: "బ్రిటిషు సామ్రాజ్య రక్షణకై మాత్రం మేమీ యుద్ధం చేయడంలేదు. మీ యుద్ధ నిపుణులు ఆ వుద్దేశంతో యుద్ధం చేస్తూంటే, వారి కెవరూ సహాయం చేయరని త్వరలోనే తెలుసుకొన గల్గుతారు........ భారత దేశ సమస్య కఠినమైనదని మాకు తెలుసు, కాని దాని పరిష్కారానికి మీ ప్రభుత్వ మవలంభిస్తూన్న పంథాలో యే న్యాయసూత్రానికి స్థానంలేదు." 'మిసెస్ గంథర్' అనే అమెరికన్ రచయిత బ్రిటిషు ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తూ "న్యూ రిపబ్లిక్" పత్రికలో వ్యాసం వ్రాసింది: భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడే యీ యుద్ధంలో విజయం ప్రారంభమవుతుందని ఆమె ఖచ్చితంగా తెలియజేసింది. ఈ విషయమై అమెరికన్ ప్రజలు, బ్రిటిషు ప్రజలు తమ కర్తవ్యాన్ని నెరవేర్చితీరుతారని ధైర్యంతో పలికింది.

షుమారు 40 మంది బ్రిటిషు ప్రముఖులు అమెరికన్ అధ్యక్షుని భార్యకు ఇండియా విషయమై జోక్యం కలిగించుకోవలసిందని పంపిన విజ్ఞప్తి తప్ప, భారతదేశాన్ని గురించి అమెరికన్ పత్రికల వ్యాఖ్యలుగాని, బ్రిటిష్‌పత్రికల వ్యాఖ్యలుగాని, ఇండియాలో ఈవారం ప్రచురించబడనేలేదు. సెన్సార్ అధికారుల యీ తాళం బిగింపులు చూస్తే సామ్రాజ్యవాదానికి నేడెట్టి దుర్గతి పట్టిందో గోచరమౌతుంది.

జోషీ ప్రకటన

వైస్రాయిలు, సెన్సార్ అధికారులు, వేసే యీ తాళాలకన్నింటికీ చెవి భారతీయుల చేతులలో ఉన్నదను సంగతి పాపం వీరికి తెలియదు! భారతకమ్యూనిస్టుపార్టీ తరపున కామ్రేడ్ జోషీ యీక్రింది విధంగా ప్రకటించాడు: "రాజాజీ కోరికను ప్రభుత్వం నిరాకరించడంవల్ల ఎలాగైనా రాజీ కుదరకుండా చేయడం దాని ఉద్దేశమని స్పష్టంగా తెలిసిపోయింది ...దీనికి మార్గమొకటే వుంది. జాతీయైక్యత నిరంకుశాధికారుల దయాధర్మభిక్ష కాదనే సంగతిని మనం గుర్తించాలి. ఈ నిరంకుశ చర్యను ప్రత్యేకసభలలో ఖండించవలసి యుంది. వివిధరాజకీయపార్టీలు ఐక్యకంఠంతో జాతీయనాయకుల విడుదలకై తీవ్రంగా ఆందోళన చేయాలి. జాతీయైక్యతకు, జాతీయప్రభుత్వ నిర్మాణానికి, యిది ప్రథమ సోపానం. దేశీయులందరూ ఈ ఉద్యమంలో విరివిగా పాల్గొనవలసి యుంది."

సోవియట్ రష్యాలో సయ్యద్ అబ్దుల్ రహిమాన్ అనే మహమ్మదీయ మతగురువు యీ క్రిందిప్రకటన గావించాడు: "సోవియట్ యూనియన్‌లో నివసించే మహమ్మదీయులు ఇతర సోవియట్ ప్రజలతోబాటు రెడ్‌ఆర్మీలో చేరి, యుద్ధం చేస్తున్నారని ప్రపంచం తెలుసుకోవలసి యుంది. మిత్రరాజ్యాల కంతిమవిజయం లభించేవరకు వారు హిట్లరు సేనలతో పోరాడితీరుతారు." ఈ ప్రకటనవల్ల మన భారతదేశ ముస్లిములు కూడా నేర్చుకోనవలసిన పాఠ మెంతోవుంది. ఇతర భారతీయు లందరితోబాటు వారుకూడా జాతీయనాయకుల విడుదలకై ఆందోళనచేస్తూ, జాతీయైక్యతకు కృషిచేయవలసియుంది.

పార్టీ నిధికి

ఆంధ్రమహిళల త్యాగదీక్ష

కామ్రేడ్
నండూరి ప్రసాదరావు

కమ్యూనిస్టు పార్టీ కార్మికోద్యమాన్ని నిర్మించింది; రైతు ఉద్యమానికి స్వరూపము యిచ్చింది; విద్యార్థి ఉద్యమాన్ని సృష్టించింది; వ్యవసాయ కూలీ ఉద్యమానికి నాయకత్వం వహించింది; మహిళా ఉద్యమాన్ని కాస్మపాలిటన్ క్లబ్బుల సోఫాలలోనుండి వాస్తవిక ప్రపంచంలోకి తీసుకువస్తూవుంది.

మహిళా ఉద్యమాన్ని గూర్చి ప్రజాశక్తి ప్రకటించదేం; దాన్ని చిన్న చూపు చూస్తున్నారా? అంటారు కొందరు. రిపోర్టులు లేనిదే గాలికబుర్లు పోగుజేసి వ్రాయమంటారా అంటాము మేము రిపోర్టులు లేనంతమాత్రాన ఉద్యమము బలహీనమైనదికాదు; ఆంధ్ర మహిళామండలి యంతా చైతన్యం పొందుతోంది. నిన్న మొన్నటివరకు తల్లి తండ్రుల చాటున, అత్త మామలచాటున పెరిగిన సోదరీమణులు నేడు కార్యరంగంలోకిదూకుతున్నారు. కామ్రేడ్ సుందరయ్య విజ్ఞప్తి చదివిన అనేకులు ఉత్తేజులౌతున్నారు. "మాకు కార్యక్రమం ఇవ్వండి" అని డిమాండు చేస్తున్నారు. కమ్యూనిస్టుపార్టీ తమ పార్టీ అని గుర్తిస్తున్నారు. ఇదంతా కమ్యూనిస్టుల 'డాబు' అనుకుంటారేమో! మచ్చుకు రెండు ఉదాహరణలు చూపిస్తాను :—

కమ్యూనిస్టుపార్టీ తూ. గో. కమిటీ సెక్రటరీకి,
కామ్రేడ్!

ప్రతివారం ప్రజాశక్తి చదువుతూ అందు విషయాలమీద నేనూ, నా భర్త కామ్రేడ్ సత్యనారాయణ, చర్చలు సాగించుకుంటూ వుంటాం. దీని ఫలితంగా కొంత రాజకీయ పరిజ్ఞానం సంపాదించి, మన మాతృభూమికి ఫాసిస్టు దురాక్రమణదారుల నుంచి రానున్న ప్రమాదం గుర్తించగలిగాను.

మన ప్రియ మాతృభూమిని యీ ప్రమాదంనుండి రక్షించి, స్వాతంత్ర్యం సంపాదించడానికి దేశమంతటా బ్రహ్మాండమైన జాతీయైక్యతా వుద్యమం లేవదీసి, దానిని సాధించడానికి మీ పార్టీ, కామ్రేడ్స్ చేసే నిరంతర త్యాగాల్ని చూస్తున్నాను.

మీ పార్టీకి సర్వవిధాలా సహాయం చేయటంద్వారా యీ వుద్యమాన్ని బలపరచడం నాయొక్క, ప్రతి స్త్రీయొక్క విద్యుక్తధర్మం. నాకు వున్న సర్వస్వం ఐన, నా భర్త వివాహకాలంలో యిచ్చిన యీ మంగళసూత్రాన్ని మీ పార్టీ నిధికి విరాళంగా యివ్వడంద్వారా నేను జాతీయైక్యతా వుద్యమానికి హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. నా సానుభూతిని దయతో స్వీకరించండి.

అభివందనములతో,
(సం) దంతులూరి చంద్రమ్మ.

నగలూ, నాణాలు వచ్చిపడ్డాయి

ఇదొక్కటేగాదు. కృష్ణాజిల్లాలో బంగారం పోగులుగా పడింది. మా కృష్ణా సెక్రటరీ బెజవాడ, గుడివాడ, గన్నవరం మహిళా సంఘ వర్కర్లను సమావేశ పర్చాడు. మొత్తం 36 గురు హాజరై, సభ కళకళలాడుతూ వున్నది. సెక్రటరీ వారికి అప్పీలు జేశాడు. "వంటచెయ్యడం, పిల్లల్ని కనడమే స్త్రీల కర్తవ్యం" అనే హిట్లరు ధర్మపన్నాలకి "ప్రతిస్త్రీ ప్రభుత్వాన్ని నడపగలిగిన సామర్థ్యం కలిగివుండాలి" అన్న లెనిన్ మహదాశయానికి గల తేడాను గ్రహించవలసిందన్నాడు. స్త్రీలకు సంపూర్ణమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కమ్యూనిస్టు సమాజంలోనే లభ్యమౌతాయన్నాడు. నేడు ఒక ప్రక్కనుండి స్త్రీలనందరినీ వంటకత్తెలుగా తయారుచేసే ఫేసిస్టు భూతం దేశాన్ని మింగజూస్తుంటే, కమ్యూనిస్టు పార్టీ ఒక్కటియే స్త్రీలను ఆత్మసంరక్షణ చేసుకుంటానికై తయారు చేస్తోందన్నాడు. 1857 లో మాతృదేశ స్వాతంత్ర్యానికై రాణియోన్సి, ఈ నాడు స్పెయిన్‌లో ఫేసిస్టురాక్షసిని, నాశనంజేయటానికి పాషనారా, ఏవిధంగా కృషిజేసి ఈ ప్రపంచానికి ఆదర్శప్రాయులైనారో, మహిళామణుల శక్తి ఎటువంటిదో, తెలియజేశాడు. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్' అన్నట్లు కమ్యూనిస్టుపార్టీ ఫాసిస్టు ప్రళయాన్నుండి స్త్రీలను సంరక్షింపజేసే ప్రయత్నాలను గూర్చి వివరించాడు. స్త్రీలు తమ మానాన్ని, ప్రాణాల్ని రక్షించుకోవాలంటే కమ్యూనిస్టుపార్టీని బలపర్చి కమ్యూనిస్టు పంథాను అనుసరించాలని హెచ్చరించాడు. చివరకు కామ్రేడ్ జోషీ అప్పీలును వినిపించి, పార్టీఫండుకు విరాళాలివ్వమన్నాడు

గలగల చప్పుడు; మిలమిల మెరపులు; సెక్రటరీకళ్ళు మిరుమిట్లు కొల్పాయి. 15 బంగారుగాజులు, 5 బంగారు ఉంగరాలు, 8 నవర్సుల 2 గొలుసులు, వెండికప్పులు, గ్లాసులు పట్టాలు, మట్టెలు, కుంకుమబరిణెలు "ఓ", ఒకటేమిటి, రకరకాల సామాన్లు సెక్రటరీ ఒళ్ళో పడ్డాయి. అన్నీ లెక్కజూచుకుంటున్నాడా గోపాలరావుగారూ, నేను దీదదాన్ని ఇవ్వగలిగింది ఇంతకన్న ఇంకేమీలేదు" అనే స్వరం వినబడింది. తలయెత్తి చూసేటప్పటికి, ఒక సోదరీమణి పసుపుతాడుకు కట్టబడి మిలమిల మెరస్తున్న మంగళసూత్రాన్ని చేత్తో పట్టుకొనివున్నది. సెక్రటరీ ముగ్ధుడైపోయాడు తర్వాత చదివింపులు ప్రారంభమైనాయి. ఒకరు వం.ద, మరొకరు ఏభై, ఈవిధంగా మొత్తం రు 263 పోగుబడ్డాయి. రొఖ్ఖరూపేణా సభకురాలేనిసోదరీమణులు ఒకవుంగరాన్ని, కాలిపట్టాని పంపారు. వీరందరూ మొగమాటంవల్ల ఇస్తున్నారా అనుకున్నాడు సెక్రటరీ. కాని వెంటనే అతని అనుమానం తీరింది. 30 మంది సోదరీమణులు తాము కామ్రేడ్ సుందరయ్య వ్యాసాన్ని చదివామన్నారు. నేటి పరిస్థితులలో తాము ఆత్మసంరక్షణోపాయాలు నేర్చుకోవలసిన అవసరాన్ని గుర్తించామన్నారు. భయంకర యుద్ధ ప్రళయం మధ్యకూడా తమ సోదరీమణులను మర్చిపోని కమ్యూనిస్టుపార్టీ తమ పార్టీయేనని తెలుసుకున్నామన్నారు. రాబోయే ప్రళయం నుండి తప్పించుకోవాలంటే జాతీయైక్యత ఒక్కటే మార్గమనీ, ఆమార్గాన్ని చూపించిన కమ్యూనిస్టుపార్టీ అడుగుజాడల్నే తాము నడుస్తామనీ, తెలియజేసారు. ముందు చేయబోయే త్యాగాలలో ఈ విరాళాలు ఒకలెక్క కాదన్నారు. ఏ పరిస్థితులలోనైనా పార్టీ తమ సహాయ సానుభూతులను పొందగలదని హామీ ఇచ్చారు.

చిరునవ్వునవ్వుతూ రాష్ట్రకమిటీ ఆఫీసుకు వచ్చాడు కామ్రేడ్ గోపాలరావు ఏమిటిసంగతి యని అడిగాను. మరేంభయంలేదు; ఫాసిస్టు ప్రళయానికి చెలి చలికట్టలుగా మన చెల్లెళ్లే నిలుస్తారు' అన్నాడు ధీమాతో

కమ్యూనిస్టులకు డబ్బెక్కడిది? మాన్లో బంగారమా, గవర్నమెంటు అంచాలా? కృష్ణాజిల్లా మహిళల నడగండి. పార్టీ ఫండుకై తన సర్వస్వాన్ని అర్పించిన సోదరి చదలవాడ శేషమ్మగార్ని అడగండి.

ఓర్పు, పట్టుదల విజయానికిమార్గం

అవటానికి ఆయన పేరు మోసిన డాక్టరే! పెద్దపెద్ద చదువులు చదివినవాడే! కాంగ్రెసు అభిమానే! పైగా అహింసావాదే! అయితే మాత్రం, కాంగ్రెసు నాయకులను విడుదల చేయమనే విజ్ఞప్తిపై సంతకంచేయమని కోరే కమ్యూనిస్టులను తిట్టకూడదనివుందా ఏశాస్త్రంలోనన్నా?

అది విజయనగరం. కామ్రేడ్సు సూర్యనారాయణ, ఆంజనేయులు పట్టణంలో ఇంటింటికి తిరుగుతున్నారు. ఊసుపోకకాదు; కమ్యూనిస్టుపార్టీ ఆదేశానుసారం కాంగ్రెసు నాయకులను విడుదలచేయమని వైస్రాయికి విజ్ఞప్తులు పంపిస్తానికి తిరుగుతున్నారు. పగలల్లా కాళ్ళు బలపాలు కట్టేటట్లు తిరిగి, చాలా సంతకాలు పెట్టించారు. సందేహాలున్నవారి కందరికీ సమాధానాలు చెప్పి ఒప్పించారు. చదువుకున్న వాళ్లేమిటి, చదువురాని వాళ్లేమిటి, అందరూ సంతకాలు చేశారు. కాంగ్రెసు నాయకులను విడుదలజేయమని ఎవరు కోర్లరు గనుక?

తిరిగతిరిగి ఒక డాక్టరు ఇంటికి వెళ్ళారు. డాక్టరు ఇంట్లోలేడు. కుటుంబంచే సంతకాలు పెట్టించి బయటకు రాబోతూవుంటే డాక్టరే ప్రత్యక్షమైనాడు. రోగు లనుకున్నాడేమో కూర్చోమని, హాటూబూటూ వూడదీసుకువచ్చి బాతాఖానీ ప్రారంభించాడు. మనవాళ్లు ఆకబుర్లు ఈకబుర్లు చెప్పి మెల్లిగా గ్రంథంలోకి దిగారు. తాము కమ్యూనిస్టులమనీ, ఫలానా పనిమీద వచ్చామనీ చెప్పారు. విజ్ఞప్తిపారం చూపించారు. ఇదేమీ ఆయన దృష్టిపథంలోలేదు; కమ్యూనిస్టులం అనేపదమే ఆయన చెవుల్లో గింగురు మంటోంది. వెంటనేతాను సంతకం జేయనన్నాడు. తాను గాంధియిస్టు నన్నాడు. ప్రభుత్వం ఎవరు? వైస్రాయి ఎవరు అన్నాడు. ప్రస్తుతం కాంగెసుపేరుతో జరుగుతున్న వుద్యమానికి కమ్యూనిస్టులు వ్యతిరేకులు గనుక కమ్యూనిస్టులు ఏమిచేసినా తాను ఒప్పుకోనన్నాడు. కామ్రేడు ఆంజనేయులు మాత్రం ఊరుకోలేదు. చల్లగా వాదించటంసాగించాడు. ప్రభుత్వం ఉన్నదీ లేనిదీ ప్రత్యక్ష పరిస్థితులను చూడమన్నాడు. కాంగ్రెసు నాయకుల విడుదల విషయంలో ఎవరూ జోక్యం కల్గించుకోకపోతే, వాళ్ళందరూ మాయమై బయటకు వస్తారా, జపానువాళ్లువచ్చి విడిపిస్తారా? అన్నాడు. కాంగ్రెసు నాయకులు బయటలేకపోతే జపాను ఫాసిస్టులను ఎదిరించటానికి దేశప్రజలను ఎవళ్లు తయారు చేస్తారు అన్నాడు.

ఈ వాదనతో ఆగాంధిస్టుడాక్టరుకు కమ్యూనిస్టులపై మంట నసాళాని కెక్కింది. వాదనలో దిగితే ప్రయోజనం లేదనుకున్నాడు. వాదించలేడుకూడాను. కాబట్టి శేషం కోపేన పూరయేత్. ఉవ్వెత్తుగా కుర్చీలోంచి లేచి ఆంజనేయులు మెడపట్టి "అహింసాపద్ధతుల్లో" బయటకు గెంటాడు. సూర్యనారాయణను కుర్చీలోంచి బడదోసి చెప్పుచ్చుకుకొడతానని బెదులు తొక్కాడు. మొత్తంమీద కమ్యూనిస్టుల నిద్దరినీ బయటకు త్రోశాడు.

ఈ కలగాంధ్వని విని నల్లయా వోగయ్యారు. మన కామ్రేడ్సు వారికి ఓపికతో సంతకాలకై విజ్ఞప్తిచేశారు. 'గాంధియిస్టులు' గాంధిజీని విడుదల పెట్టమని అడగటానికి ఒప్పుకోడట, ఇదేంగాంధియిజమో! ప్రభుత్వం లేదనుకుంటూ నిప్పుకోడిలాగా కళ్లుమూసుకు కూర్చుంటే ప్రమాదం తప్పుతుందా! స్వరాజ్యం వస్తుందా? చెప్పండి" అన్నారు. 25 మంది పోగయిన ప్రజలు విజ్ఞప్తిమీద సంతకాలు పెట్టారు. డాక్టరుమీద తలాఇన్ని అక్షితలు చల్లారు. "అయ్యో! ఎరక్కపోయి వెళితినే, కమ్యూనిస్టులతో వాదనకు!" అనుకుని వుంటాడు పాపం డాక్టరు మహాశయుడు!

పార్టీ ఫండు
(14-11-42 వరకు)

పార్టీ సభ్యులు, సానుభూతిపరులనుండి విరాళాలు	10999-9-9
పార్టీ ఫండు టిక్కెట్ల అమ్మకం ద్వారా	270-8-0
ఆభరణాలు వగైరా	1645-0-0
మొత్తం	12,915-1-9

(6 వ పేజీ తరువాయి) చేతిలో పెట్టాడు. కొంతమంది ముస్లింలు ఇదివరకే 'ఖౌమీ జంగ్'ను చదువుతున్నారు. వారు ఆ పత్రికను మెచ్చుకుంటున్నారు. జాతీయ స్వయం నిర్ణయ సూత్రములో హిందువులను ఒప్పించగలరా యని సందేహం. కామ్రేడ్సు కాంగ్రెసు నాయకులకు విజ్ఞప్తి చేసిన హిందువుల సంతకాలు చూపగానే ముస్లిం సోదరులు ఆనందభరితులైనారు. చౌక డిపోలను పెట్టించండని కోరినారు. విద్యార్థులు ఆంధ్ర విద్యార్థి ఫెడరేషన్ పట్ల విధేయతను కన్పరుస్తూ విజ్ఞప్తులపై విరివిగా సంతకాలు చేశారు. ఒక పార్టీ సభ్యుడు, ఆయన భార్య పార్టీ ఫండుకుగాను రు 2000/- లను, మరొక పార్టీ సభ్యుడు రు 1000/- లను విరాళాలిచ్చారు. చాలా మితవ్యయము చేయు సానుభూతిపరుడు రు 1000/- లు విరాళమిచ్చాడు.

విజయనగరంలో: వారంరోజులూ వరుసగా జాతీయైక్యతా దినం, నిర్బంధ నిరసన దినం, ఫాసిస్టు వ్యతిరేక దినం, రష్యాదినం, చైనాదినం, అధిక లాభాల నిరసన దినం, రష్యా విప్లవదినం, క్రింద విభజింపబడి వరుసగా జరిగినవి. సంతకాల ఉద్యమం, ప్రచారము చాలా చురుకుగా సాగింది. వేయికిపైగా సంతకాలు చేశారు. ప్రతి దినం పార్కులో 200 మందికి తక్కువ కాకుండా సభకు హాజరైనారు.

ప. గోదావరి జిల్లాలో: గణపవరం, పత్తేపురం, రావులపర్రు, నిడమర్రు, చాటపర్రు, పినకడిమి, వట్లూరు, పెదపాడు, పాత పెదపాడు, గోగుంట, నాయుడుగూడెం, సత్యవోలు, పోతునూరు, దోసపాడు, గుండుగొలను, భీమడోలు, దెందులూరు, శ్రీరామవరం, జోగన్నపాలెం, కొవ్వలి;

నెల్లూరు జిల్లాలో: చెన్నూరు, గూడూరు, మంగళాపూరు, తుంగపాలెం, మనుబోలు, వెంకన్నపాలెం, చెర్లోపాలెం, బద్వేలి, చిల్లకూరు, ఇందుపూరు, తలమంచి, విడవలూరు, ఊటుకూరు;

గుంటూరు జిల్లాలో: గుంటూరు, దుగ్గిరాల, పద్భూరు, కూచిపూడి, క్రాప, వద్దమాను, బోరుపాలెం, అబ్బురాజపాలెం, హరిశ్చంద్రపురం, దొండపాడు;

కడపజిల్లాలో: పుల్లంపేట, కోడూరు, అనంతరాజుపేట, ఓబులవారిపల్లె - గ్రామాలలో జాతీయైక్యతావాదం ఉధృతంగా జరుపబడింది.

"మనకత్తులకు ఫాసిస్టుల నెత్తురంటాలీ!"

జాతీయైక్యతా వారంలో అనుభవాలు

ఆ రోజున ఏలూరు రోడ్లనిండా జనమే. అరుగులనిండా జనమే. కొట్లనిండా జనమే. కాఫీతాగుదామని డాక్టరు రాంబాబు హోటలు కెడితే, సర్వర్లందరూ కూడా ఎగబడి చూస్తున్నవాళ్ళే. ఏమిటా ఈజనం. ఈ చోద్యం అని రాంబాబు కూడా గుంపుల్లో కలిశాడు. కాని పొట్టివాడేమో, బుజాలు పట్టుకు ఎగిరెగిరి చూచినా లోపలనుండి "ఫాసిస్టులను తరిమికొట్టండి, తందానతానా ; ప్రజామైక్యతే దాని శత్రువండీ, తందానతాన" అని పాట వినవస్తుందే గాని ఏమీ కనపడటంలేదు. ప్రక్కనున్నవాళ్ళ నడిగితే "వేషాలు వేషాలు" అనే వారే గాని ఏం వేషాలు, ఏం పాటలు, ఎందుకింతమంది విరగబడిచూస్తున్నారు, చెప్పేవారే లేరు. ఇట్లాకాదనుకొని దగ్గరనున్న లాంతరు స్తంభాన్ని పట్టుకొని అమాంతం పైకెగిరి చూశాడు. లోపల ఏమిటి చోద్యం ;

బుడబుక్కలాడు కొంతమంది, గోసాయీలు కొంతమంది, ఫకీర్లు కొంతమంది, గుడ్డిపాటగాడు ఒకడు, కలగా పులగంగా చేరారు. గుడ్డిపాటగాడుపాడుతున్నాడు "ప్రతిన బూనరా ఘోర ప్రతినబూనరా" అని. జపాను వాళ్లుఅనేగాతకులున్నారట.మానాన్నివదలమని తల్లులముందే పిల్లల్ని చిత్రవధజేస్తారట. ఆకాశం నుండి మేఘాలచాటుగా వచ్చి అగ్నివర్షం కురిపించి ఇళ్ళుదళ్ళు, పాడిపంటలు అన్నీ ధ్వంసం జేస్తారట. తియ్యతియ్యని కబుర్లు చెప్పుతూ దగ్గిరకివచ్చి హఠాత్తుగా పీకపిసికి చంపుతారట. మనల్ని మనం పరిపాలించుకోలేమట, అందుకని వాళ్ళరాజ్యంలో కలుపుకొని బూసయ్యో ; బోసయ్యో ; ఎవరినో మన నెత్తిమీద కూర్చోబెడుతారట. ఈ రాక్షసుల్ని సంహరించాలి. మనమంతా ఏకంకావాలి. అందరూ ఏకమై బడితెపుచ్చుకు బయల్దేరితే, సప్తసముద్రాలు దాటి పారిపోరా ఈ రాక్షసులు; అంటూ యీ కథను పాడుతున్నాడు. నాగస్వరానికి పాములన్నీ తలలూపునట్లే ప్రజ అందరు తలలూపుతున్నారు. ఇంతలో ఒకఫకీరు "కార్మిక కర్షకవీరులు కత్తిబట్టాలీ, మన కత్తులకు ఫాసిస్టుల నెత్తురంటాలీ" అనే పదం పుచ్చుకున్నాడు. ఫకీరు చేతులో గిలక గిర్రుమంటూంటే ప్రజలచేతుల్లో కర్రలు పైకిలేస్తున్నాయి. ఇంతలోకే ఒకసాధు ఫకీరుపక్కజేరి, మన ఇండియాదేశపు ప్రజ లైక్యమవ్వాలీ, అంటూ పాట గొరకపుచ్చుకున్నాడు. దానితో సాధువులు, ఫకీర్లు, బుడబుక్కలూ, అంతా అందుకున్నారు. మఠా ముందుకు సాగింది.

రాంబాబు క్రిందికి దిగి, ముందుకు సాగుతూండగా "సోదరా ; కాంగ్రెసు నాయకుల విడుదలను కోరవా ?" అనే విజ్ఞప్తి వినవచ్చినది. వెనక్కితిరిగి చూచాడు, సుత్తీ-కొడవలి హత్తిన జండా నొకచేత, వైస్రాయికి విజ్ఞప్తిని ఒకచేత పుచ్చుకొని ఒక యువకుడు, పార్టీ ఫండు హుండీ చేత బుచ్చుకొని మరొక యువకుడు కన్పించారు. జనం వాళ్ళను చుట్టుముట్టివేసింది. సంతకాలు పెట్టేవాళ్ళు కొంతమంది; డబ్బు హుండీలో వేసేవాళ్ళు కొంతమంది.

తన ముడుపు చెల్లించుకొని, విజ్ఞప్తిమీద సంతకం గీసి, కాఫీ హోటలులో జేరాడు రాంబాబు. హోటలు సర్వర్లు, క్లీనర్లు అందరూ కూనరాగాలు తీస్తున్నారు. ఏమని ? 'మనకత్తులకు ఫాసిస్టుల నెత్తురంటాలీ' 'ప్రతిన బూనరా ఘోర ప్రతిన బూనరా ;' ప్రతిన సంగతి తర్వాత, కాఫీతెమ్మన్నాడు రాంబాబు ప్రక్కనే కూర్చున్న ఒక వ్యక్తి "గవర్నమెంటుతో కలిసినపార్టీ అన్ని ప్రతిజ్ఞలు పడుతుంది"అన్నాడు. రాంబాబుకు చిత్రంగా తోచింది. ఆబాలగోపాలము కమ్యూనిస్టు ప్రచారాన్ని మెచ్చుకుంటూ వుంటే ఈ అపస్వరమేమిటా అనుకొన్నాడు. మెల్లిగా కదిలించాడు ఆ అపరిచిత వ్యక్తిని. 'కోప్పడకండి, కమ్యూనిస్టుపార్టీ అంటే 1924 నుండి జైళ్ళలోనో, రహస్య స్థలాల్లోనో బ్రతికిన పార్టీ. గవర్నమెంటుకీ దానికీ చుక్కయెదురు. దేశంలో యేమూల రైతులు తమ హక్కులకై పోరాడినా, కూలీలు సమ్మెలు చేసినా, వాటి అన్నిటిలోనూ కమ్యూనిస్టులే ముందున్నవారు. 1936 నుంచీ కాంగ్రెసు యే విప్లవ పంథాను నడచినా దానికి కమ్యూనిస్టుల కృషియే కారణం. ఈనాడు ప్రజలనెదుర్కొంటూన్న సమస్యలేమిటి ? ఫాసిస్టుల మహాప్రళయం నానాటికి ముంచుకువస్తున్నది. దాన్ని ఎదుర్కోవాలి. తీరా వచ్చినతర్వాత మామూలు ప్రజల్ని విమానదాడులనుండి రక్షించాలి. దీనికిగాను ముందు శత్రువును యెదుర్కొంటానికి ప్రజల నందర్ని తయారుచేయాలి. ఇతరులకు ప్రథమ చికిత్స, విమానదాడి రక్షణ మొ॥ యేర్పాట్లు చేయాలి. ఇవన్నీ జయప్రదముగా జరగాలంటే, జాతీయ ప్రభుత్వం వుండాలి. కాంగ్రెసులేనిదే జాతీయ ప్రభుత్వం స్థాపించటం అసాధ్యం. ఐక్యతలేనిదే జాతీయ ప్రభుత్వం సాధ్యపడదు. అందుకుగాను కాంగ్రెసు నాయకుల విడుదలకోసం, దేశంలో అన్నిజాతుల మధ్య ఐక్యతను చేకూర్చి, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించుటకోసం, ఫాసిస్టుల నెదుర్కోంటానికి దేశాన్ని తయారు చేయటంకోసం యెవరు పని జేస్తున్నారు ? కమ్యూనిస్టులు కాదా ?" అని గట్టిగా ప్రశ్నించాడు. ఇంతలో కాఫీహోటలు ముందు జనం గొల్లుమన్నారు. "ఏం ఘోరం ? గాంధీగార్ని వదలమంటేనే నేరమా ?"అని పదిమంది ఒక్కసారిగా అన్నారు ఏమిటా అని పరకాయించి చూస్తే, ఇందాకటి జోగుల్నీ, ఫకీర్లనూ అందరిని కలియబెట్టి పోలీసు స్టేషనుకు లాక్కుపోయారట. వాళ్ళ పేర్లన్నీ రాసుకున్నారట. రాంబాబు మళ్ళీ లోపలకు వచ్చి ఆ అపరిచిత వ్యక్తిని కలుసుకున్నాడు. 'చూచావా ; కమ్యూనిస్టులు గవర్నమెంటు స్నేహితులో, లేక స్వాతంత్ర్య యోధులో; వారి ఐక్యతా ప్రచారాన్ని చూసే హడలుతోంది మేకపోతు గాంభీర్యంగల ప్రభుత్వం ; అన్నాడు. "నిజమే. ఈ ప్రభుత్వానికి ఇంగితజ్ఞానం పోతోంది. కమ్యూనిస్టుల ప్రచారమే ప్రజల్ని ఊపివేస్తోంది" అంటూ బిల్లు చెల్లించి వెళ్ళిపోయా డా వ్యక్తి.

సిపాయీలకు మాత్రం స్వాతంత్ర్యం వద్దా ?

గోదావరి స్టేషనులో మిలిటిరీ స్పెషల్ రైలు ఆగింది. కిలకిలమంటూ సిపాయీలంతా దిగారు. మిఠాయిదుకాణం ఎక్కడవుందని అడుగుతున్నారు. కామ్రేడ్ లక్ష్మీపతి ప్రజాశక్తి పుచ్చుకొని ప్లాట్ ఫారంమీద నిలబడివున్నాడు. ఒక జమాదారువచ్చి కాఫీహోటలు చూపించమన్నాడు. కామ్రేడ్ చూపించి, వారంతా తృప్తిగా తిన్నమీదట తానుకూడా వాళ్ళతో రైలెక్కాడు.జమాదార్‌తో బాతాఖానీ ప్రారంభించాడు. సంభాషణలో తాను కమ్యూనిస్టునని చెప్పాడు. జమాదారుకు ఎక్కడాలేనిఉత్సాహం వచ్చింది, ఒక సిగరెట్టును కామ్రేడ్‌కు ఇస్తూ, తన అనుభవాల్నిగూర్చి చెప్పాడు. ఆయనది మలబారట. నంబూద్రిపాడ్, కృష్ణ పిళ్ళె వారిని ఎరుగునట. కె. పి. ఆర్. అంటే చిరక్కాల్ రైతులు ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తారన్నాడు. కమ్యూనిస్టుపార్టీఅచ్చటి రైతులకు, కూలీలకుగాను చేస్తున్నకృషిని శ్లాఘించాడు. ఈనాడు కమ్యూనిస్టులిచ్చే నినాదాలు జపాను ఫాసిస్టుల్తతో పోరాడ్డబోవుచున్న తమకెంతో ఉత్సాహకరంగా వున్నా యన్నాడు. సైనికులందరూ భారతదేశ స్వాతంత్ర్యాన్ని కోరుతున్నారన్నాడు. రైలుబడ్డీలు పీకివేస్తే స్వాతంత్ర్యం రాదన్నాడు. ఈనాటు దేశీయులందరూ ఏకమై యుద్ధకృషిలో పాల్గొంటే విజయం తప్పక వస్తుందనీ, అటు పిమ్మట ఆప్రజలు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోటానికి ఏ ప్రభుత్వమూ అడ్డగించలేదనీ తెల్పాడు. గాంధీజీని, యితర నాయకుల్నీ, విడుదల చేస్తే నేగానిప్రజలందరూ ఊరుకోరు అన్నాడు. కాంగ్రెసు- లీగు ఏకమైతే ప్రభుత్వం ఇంక ఎక్కడ వుంటుంది అన్నాడు.

ఈ ధోరణిలో రైలు కదలటం, ప్రక్కస్టేషనుకు జేరుకోవటం కామ్రేడ్ గుర్తించనేలేదు. రాజమండ్రి స్టేషను జేరగానే పార్టీ ఫండు టిక్కెట్టు నొక దానిని జమాదారు కిచ్చాడు. అతడెంతో సంతోషంతో తీసుకొని బేడ యిచ్చాడు. నెలాఖరు కాబట్టి తనదగ్గర ఎక్కువ డబ్బులేదనీ, అందుచేతనే తక్కువ యిస్తున్నాననీ చెప్పి చిన్నబుచ్చుకున్నాడు. రైలు కదిలింది. పిడికిలి బిగించి సాల్యూటుచేసే జమాదారు వైపు చాలాదూరం వరకూ చూస్తూ, మన కామ్రేడ్‌కూడా వెళ్ళిపోయాడు.

మహజర్లపై సంతకాలు

(ఐక్యతావారంలో 12-11-42 వరకూ)

జిల్లా	గ్రామాలు	జిన్నాకు	కాంగ్రెసు నాయకులకు	వైస్రాయికి
విశాఖ	5 (1టౌను)	....	92	229
తూ॥ గో॥	2 (1టౌను)	....	151	327
ప॥ గో॥	19	....	304	636
కృష్ణా	21 (1టౌను)	307	3576	4113
గుంటూరు	33	173	4078	4288
నెల్లూరు	64	268	4912	5081
చిత్తూరు	3	33	103	523
కర్నూలు	1	....	22	22
అనంతపురం	11	....	....	917
28-10-42 కు ముందు (అన్నిజిల్లాలు)	262	....	....	25,500
	423	781	13.238	41.636

రాష్ట్రమంతట ఐక్యతా వుద్యమం

నాలుగు రోజులనుండి "ప్రజాశక్తి"కి వచ్చే ఉత్తరాలు రెండు, మూడు, రెట్లు ఎక్కువ అయినాయి. అవన్నీ ఐక్యతా వుద్యమాన్ని గూర్చిన వార్తలే; రిపోర్టులే, అన్నీ ఉత్సాహకరమైనవే. ప్రజలందరూ కమ్యూనిస్టు నినాదాన్ని ఏ విధంగా బలపర్చుతున్నారో తెల్పే నిదర్శనాలే.

విశాఖపట్టణంలో : కార్మిక దళాలు 5 బయలుదేరి కార్మికులుండే పేటలలోను, శ్రీహరిపురం, గుల్లలపాలెం, రామమూర్తిపేట, గొరకంచరపాలెం,రెడ్డీకంచరపాలెం గ్రామాలు తిరిగి ప్రచారంచేశారు. ప్రజలలో కల్గిన సందేహాలకు సమాధానాలు చెప్పిన మీదట అనేకమంది సంతకాలు చేశారు. 70 పార్టీ ఫండు టిక్కెట్లుకూడా తీసుకున్నారు. "ప్రజాశక్తి" విరివిగా పత్రికలు కావాలంటున్నారు. మరొక 3 విద్యార్థి దళాలు బయలుదేరి, విద్యార్థుల లాడ్జీల వెంబడి తిరిగారు. అనేకమందిని కలుసుకొన్నారు. సాధారణంగా విద్యార్థులే ఆగస్టు పిమ్మట ఎక్కువగా ఉద్రేకులైనారు. వారిలో కూడా చాలామంది ఐక్యతావుద్యమాన్ని అంగీకరిస్తూ సంతకాలుపెట్టి చందాలు యిచ్చారు. మొత్తంమీద ఒక్క దళమే విద్యార్థుల నుండి రు 16-6-0 ను వసూలుచేసి "ప్రజాశక్తి"కి 7 గురను చందాదార్లగా జేర్పించారు. ఈ ప్రచారంవల్ల కల్గిన అనుభవాలనుగూర్చి విశాఖపట్టణం రిపోర్టు ఇది ; "ప్రజలందరూపూర్తిగా ఏమిచేయుటకు తోచక నిస్పృహ చెందారు. నేడు జరుగుతూన్న అరాజకోద్యమము ప్రమాదమేగాని, యింకొక మార్గమేమీ లేదుగాదా అని. కాని, మనం మన పంథాచూపినతర్వాత యిది చాలమంచి మార్గమనేవారు."

రేపల్లెలో : ఈ ఐక్యతా ఉద్యమంవల్ల పెద్ద రైతులు, వర్తకులుకూడా రక్షణదళాలు, వాలంటీరుదళాలు అవుసరమని గుర్తిస్తున్నారు. గ్రామాలలో ఐక్యత అవుసరమని ఒప్పుకుంటున్నారు. బీదరైతులు, చేతి పనులవారు, మనం పడే కష్టాల్నిగుర్తిస్తున్నారు; ఐక్యతానినాదాన్ని ఒప్పుకొంటున్నారు. కూలీలలో కమ్యూనిస్టు లంటేను, రష్యా అంటేను, ఎంతో సానుభూతి వుంది. ఉద్యోగస్థులుకూడా ఐక్యతానినాదాన్ని ఒప్పుకుంటూ చందాలు యిస్తున్నారు.

వెంకటగిరి : బొంబాయిలో పెద్ద షాహుకార్లు ఏ విధంగా రహస్య వ్యాపారం సాగించి చిన్న షాహుకార్లను దగా జేసారో పేపర్లు వారి చదివి వినిపించగా చిన్న షాహుకార్లందరూ తమ్ము పెద్ద షాహుకార్లు పెట్టే బాధలను వర్ణించారు. ఐక్యతా వుద్యమాన్ని బలపరుస్తూ చందాలు యిచ్చారు.

నెల్లూరులో : ముస్లిం పేటలలోకి వెళ్ళి ప్రచారం సాగించగానే ఒక బీద ముస్లింవచ్చి "కమ్యూనిస్టు పార్టీ బీదల పార్టీ అని నాకు తెలుసు"అని పావలా (మిగత 5 వ పేజీలో)

రష్యన్ గెరిల్లా

రచయిత : కామ్రేడ్ పి. నికిటిన్
అనువాదం : కామ్రేడ్ ఎ. ఉమారాజేశ్వరరావు

ఒక గెరిల్లా గుంపు మధ్య చేతిలో టోపీ పట్టుకొని నిలబడియున్నాడు యాన్టన్ షివెడ్జి. వారి ప్రశ్నలకు జవాబివ్వటానికి చాలా తొట్రుపడుతున్నాడు. మధ్యప్రాయం, చింపిరితల, తాడుముక్కలతో కట్టుకున్న ఒకచర్మపుకోటు, ఇల్లాటి వికారమయిన, ఆకారం అతని నిష్కాపట్యాన్నీ, శాంత స్వభావాన్నీ తెలియ చేస్తున్నది. వంచియున్న తల పైకెత్తి, విచారపూరిత నేత్రాలతో తన కామ్రేడ్సు నుద్దేశించి, నెమ్మదిగా యిలా గొణిగాడు.

"అది నిజంకాదు కామ్రేడ్సు, నామాట నమ్మండి. అది నిజంకాదు "

అతడెంతో ఆవిషయమై బాధపడినట్లాతని కళ్ళు సూచించాయి.

"అయినదిచాలు." అంటూ ఒక పొడుగాటి కోసాక్ అతనిమాటకడ్డు వచ్చాడు. తన తుపాకిని గట్టిగా చేత్తో నొక్కుతూ, లేచినిలబడి మళ్ళీ అన్నాడు:

"అయినదిచాలు యాన్టన్ ; ఇదుగో నే చెబుతున్నాను. అట్లాంటిదేమీ పనికిరాదు. మేం నిన్ను తిరిగి మాలో చేర్చుకోటం అసంభవం. అస్థిరుడవైనవువ్వు ఎన్నటికీ గెరిల్లావు కాలేవు. నీదారి నువ్వు చూసుకోటం చాలా ఉత్తమం."

"కాని, ఐవాన్ పెట్రోవిచ్" అంటూ యాన్టన్ యిలా అన్నాడు. "ఒకే ఒక మార్గముంది. న్యాయ మాలోచించు, నే నస్థిరుణ్ణంటూ వెనకవన్నీ తవ్వటం దేనికి? ఇక మీదట నమ్మకంగా ఏలోపమూ లేకుండా పనిచేస్తాను."

"ఏమిటి ? నువ్వు నమ్మకంగా పనిచేస్తావా ?" అని ప్రశ్నిస్తో, సగం నరకబడిన చెట్టుమీదనుంచి గెరిల్లా నాయకుడుక్రిందకుదూకి గుడ్లు గిరగిర తిప్పుతో గంభీరంగా "సరే, దానికేంగాని, మొదట నువ్వు ఇక్కడున్న ప్రజలందరికీ ఆ బురుజుమీద జరిగిన ఘటన చెప్పు" అన్నాడు.

కొందరు హేళనగా నవ్వారు. పూర్వపు ఆ సంగతి జ్ఞాపకంవచ్చి సిగ్గుతో ఆతనిమొగం కమిలింది. అది జులై మాసం. మధ్యాహ్నం పూట. వేడి పెటపెటలాడుతోంది. ఆబురుజు మీద నుంచుని కోసాక్‌ల యిండ్లకప్పులు, బాటమీద పోయే బండ్లు, వాటి వెనుకనే లేచే దుమ్ము మేఘాలూ, ప్రక్కను వెండిలా తళతళ మెరుస్తూ ప్రవహించే డాన్ నదీ, చూస్తున్నాడు. ఈదృశ్యాలనే యిదివరకనేక వందలమార్లు చూసి యున్నాడు ప్రతివాడూ ఉత్సాహ ఉద్వేగాలతో ఏదో ఒక ఉపయోగకరమైనపని చేస్తున్నాడు. కానితానో ; చేతులుకట్టుకుని బురుజుమీద నుంచి శత్రువులజాడను పరిశీలిస్తూ వుండాలి. ఈ పనిచేసిచేసి, విసిగి వేసారి పోయాడు. ఆ ఉన్నతమైన బురుజు గ్రామస్థులందరికీ గర్వ కారణం కావచ్చు ; బురుజు శిఖరంమీద పీఠంచుట్టూ పచ్చటిరంగు వేయబడిన కటకటాలున్నాయి. క్రిందనుంచిచూస్తే పైనున్నవాని టోపీ మాత్రమే కన్పించేటంతటి యెత్తుగావుంది ఆబురుజు.

యాన్టన్ క్రిందకు చూస్తున్నాడు. అకస్మాత్తుగా సారాయిబండి ఒకటి గ్రామదుకాణానికి పోతోంది బుద్లు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అతనికి వెర్రిదాహమేసింది. బుద్లను చూసేటప్పటికి, కాలుస్తో కాలుస్తోన్న పొగాకుగొట్టం కోటుజేబులోపెట్టి, కోటునువిప్పి రెండుకర్రలకమిర్చి పెట్టాడు. అతనక్కడ లేదని క్రిందనుంచి ఎవరూ గుర్తించలేదు. టోపీ మాత్రం కనబడుతుంది. టోపీని చూసి పనిలో వున్నాడనే అందరూ అనుకుంటారు. యాన్టన్ క్రిందకుదిగి దుకాణానికి పరుగెత్తి, ఒక సారా సీసా జేబులో భద్రంచేసుకుని తిరిగి వస్తున్నాడు ఇంతలో గొట్టంలోవున్న పొగాకు నిప్పుపడి అతని కోటంటుకుంది. ఆ మంటకి గాలితోడై, అగ్నివేగంగా వ్యాపించి బురుజంతా రాజుకుంది. ఊళ్ళో కలకలం బయల్దేరింది. గ్రామస్థులందరూ బురుజుదగ్గరకి పరుగెత్తారు. సోవియట్ కవున్సిల్ ప్రతినిధులూ, అధ్యక్షుడూ, "పెర్రి పీనుగులాగున్నావు. కిందకి దిగిరా. లేకపోతే తగులబడి చస్తావ్" అంటూ పైకి చూస్తో బొబ్బలెట్టారు. టోపీని చూసి యాన్టన్ అని భ్రమపడ్డారు. వాడెందుకు క్రిందకు దిగటంలేదో వారి కర్థంకాలేదు. ఇంతలో అక్కడ చేరుకున్న యాన్టన్ వారివైపు తిరిగి,

"నే నిక్కడే వున్నాను. అది ఉత్త టోపీయే" అని భయపడుతో చెప్పాడు. జరిగిన గలభా అంతా అధ్యక్షుడు అర్థం చేసుకున్నాడు. యాన్టన్ పనినుండి వెంటనే తొలగింపబడ్డాడు. మరునాడు యీకథ అన్ని వార్తా పత్రికల్లోనూ ప్రకటింపబడింది. బాధ్యతాయుతమైన పనికి యిట్లాంటి నమ్మకంలేని వాణ్ణి నియమించినందుకు అధ్యక్షుడు చీవాట్లు తిన్నాడు. అప్పటినుండి యాన్టన్ గ్రామస్థులందరికీ హాస్యాస్పదుడయాడు. అధ్యక్షుని కితనంటే అపనమ్మకమేర్పడిపోయింది. ఈ పూర్వపుఘటన జ్ఞప్తికి వచ్చి నిశ్శబ్దంగా తలవంచుకున్నాడు.

"ఇప్పుడింక నువ్వేచెప్పు" అని అధ్యక్షుడన్నాడు. "మళ్ళీ నిన్ను నమ్ముతామని ఎట్లా అనుకోగలిగావు ?"

"అది ఏళ్ళక్రితం జరిగిన సంఘటన" అని షివెడ్జి అన్నాడు.

"ఏమీ లాభంలేదయ్యా" అన్నాడు అధ్యక్షుడు. "కాని మీరు జామీను యిస్తే ఏమన్నా చెయ్యగలను" అని గెరిల్లా నాయకునికేసితిరిగి అతడు అన్నాడు.

నాయకు డొకక్షణం ఆలోచించి యిలా అన్నాడు."సరే, నేనుజామీనుంటాను. అతన్ని మనలోచేర్చుకుందాం ఆతనికన్ని ఈప్రాంతపు బాటలన్నీ బాగా తెలిసినవా రింకొకరెవరూ యిక్కడలేరు. మనకు చేతిలోపనికూడా పుష్కలంగావుంది. శత్రుపరిశోధనాకార్యంలో నాతో వస్తాడు."

గెరిల్లాలు అరణ్య సమీపంలో ఒక శిథిల గృహంలో సమావేశమై శత్రువుల పెట్రోల్ బంకు నొక దానిని తగులబెట్టేవిషయంమీద దీర్ఘ చర్చ కావించారు దానికి ప్రక్కనే ఒక గృహముండే బాటను నిరపాయంగా ఉపయోగించవచ్చునో, కూడదో, తెలుసుకోవడానికి ముందువారిలో యిద్దరుచూసిరావాలని నిర్ణయించారు. బాట నిరపాయకరమైతే దళం అత్రోవని వెళ్ళవచ్చు, లేక శత్రువు గృహసమీపంలో వుంటే పరిశోధనకెళ్ళిన యిద్దరూ తిరిగివచ్చిన సంగతి తెలియచేస్తారు.

"దోవలో గెరిల్లా మార్ఫూషాని కలుసుకోండి. అగృహ సమీపంలోనే ఆమెనివాసం" అని వారి విజయంకోరుతూ అధ్యక్షుడన్నాడు.

గెరిల్లా నాయకుడూ, షివెడ్జీ ఏకాంత గృహంవైపు బయల్దేరారు. పెద్ద పెద్ద అంగలేస్తున్న గెరిల్లా నాయకునితో సమానంగా నడవటానికి యాన్టన్ చిన్నగా పరుగెత్తవలసి వచ్చింది. నల్లగా బొగ్గులై పోయిన కోత యంత్రాలూ, విరగకొట్టబడ్డ మరనాగళ్ళు, శిథిలగృహాలూ, వారు దాటి వెళ్ళారు. కనుచూపుమేరలో ఒక్క పిట్టకూడాలేదు. ఇంతలోనే ఆ ఏకాంత గృహంనగ్గరకి వచ్చారు. తలుపు తట్టారు. జవాబులేదు. లోపల ప్రవేశించారు. మూడు గుండ్రని ఆటోమాటిక్ తుపాకుల మొనలు తిన్నగా, వారి మొహాల్లోకి గురిపెట్టబడ్డాయి, నేలమీద ఒక రక్తప్రవాహంలో గెరిల్లా మార్ఫూషా పడివుంది.

గెరిల్లా నాయకుడు వెనుక్కు అడుగువేయ ప్రయత్నించాడు. కాని రైఫిల్ మడమ వీపుమీద శక్తివంతంగా తగిలింది. యాన్టన్‌కేసి చూశాడు యాన్టన్ ముఖం చాలా నిశ్చలంగాను, గంభీరంగాను వుంది.

"మిమ్మల్ని మేం ఖైదు చేస్తున్నాం" అని అన్నాడు జర్మన్ ఆఫీసరు రష్యన్ భాషలో.

గెరిల్లా నాయకుడేమీ మాట్లాడలేదు. దళమంతా యీ ఉచ్చులో పడకుండా రక్షించే దెట్లాగాఅను ఒకేఒకఆలోచన అతనిమనస్సును పీకుతోంది. ఎవరో మోసం చేసియుండాలి.

"ఏం మాట్లాడరేం ?" అన్నాడు జర్మను ఆఫీసరు తన కాలితో చచ్చి పడియున్న మార్ఫూషా చేతిని పక్కకు గెంటివేస్తో.

"మమ్మల్ని మీరు పట్టుకోనవసరము లేదయ్యా ; మేమూ అదే ఉద్దేశ్యంతో వచ్చాం. మా ఓటమిని యేలినవారు స్వీకరించాలని ప్రార్థించటానికి వచ్చాం." అని యాన్టన్ సాగిలబడి నమస్కారం చేస్తూ అన్నాడు. వొంగి వొంగి దాసోహం చేస్తోన్న షివెడ్జిని చూసి గెరిల్లా నాయకుడు "ద్రోహి" అనుకుంటూ పళ్ళు పటపటా కొరికాడు. షివెడ్జి తిరిగి యిలా అన్నాడు. "మా గెరిల్లా దళమంతా పూర్తిగా లొంగిపోవటానికి సిద్ధంగా వుంది. మీ షరతుల్ని తెలుసుకోటంకోసమని మమ్మల్నిద్దరినీ పంపారు. ఎవరో ఒకరిక్కడ వుంటాం. రెండవవాడు వెళ్ళి దళాన్ని తమ సన్నిధికి తీసుకువస్తాడు."

"అయితే మీ సోవియట్ అధ్యక్షుడుకూడా యిక్కడికి వస్తాడా ?" అని అనుమానంతో జర్మన్ ఆఫీసరడిగాడు.

"ఆఁ, తప్పకుండా ; అతన్ని నాదా ఇక్కడికి తీసుక వస్తాం."

ఈ షరతు ఆఫీసరుకి చాలా లాభసాటిగా తోచింది. సర్వ సాధారణంగా యే గెరిల్లా కూడా వ్యక్తిగతంగా తన ప్రాణాలతో లొంగడు. అల్లాంటిది మొత్తం దళమంతా లొంగిపోవటానికి సిద్ధంగా వుంది. అదికనక నిజంగా సంభవించినట్లయితే తన రొట్టె నేతిలో పడినట్టే. తాను - జర్మను ఆఫీసరు - పెద్ద ఉద్యోగం పొందవచ్చును, లేదా - యీ విషయం యెవరికీ తెలియవలసిన అవసరమేలేదు.

"నువ్వు అబద్ధమాడటం లేదుగద ? అబద్ధమాడితే ముక్కలుకింద కోసి కాకులకీ, గద్దలకీ వేస్తాము. అయితే, మీ యిద్దరిలోనూ యిక్కడుండే దెవరు ?"

గెరిల్లా నాయకుడు షివెడ్జిని ప్రక్కకు తోసి తాను ముందుకు వచ్చాడు.

"నేనుంటా యిక్కడ ఖైదీగా. అతడు వెళ్ళి వారి నిక్కడకు తీసుకొస్తాడు."

"అయితే నువ్విక్కడ వుంటావన్నమాట." అని షివెడ్జిని పొడుస్తూ జర్మన్ ఆఫీసరు అన్నాడు నాయకునికేసి తిరిగి, "రాత్రి 12 గంటలదాకా నీకు గడువిస్తున్నాను. నిర్ణీత కాలంలో దళం ఇక్కడుండకపోతే ఆ బాధ్యత నీది. ఫలితం అనుభవిస్తావు. మరి యితడిని యేమి చెయ్యాలో నాకు తెలుసును." అని జర్మన్ ఆఫీసరు బయటికి వెళ్ళాడు. గెరిల్లా నాయకుడు షివెడ్జికేసి చూసి "నువ్వింత చాకచక్యం గలవాడివన్నమాట" అని మనస్సులో లనుకుని ఆశ్చర్యపడ్డాడు. ఎంతో దయతో "మళ్ళీ కలుసుకుంటాను, యాన్టన్ వాసిలియవిచ్" అని అన్నాడు.

ఒక "నమస్కారం" గొణిగాడు షివెడ్జి నెమ్మదిగా. తలెత్తి యింట్లోకెళ్ళాడు. జర్మన్ పహరా సైనికుడు వచ్చి, తలుపుకి తాళం వేశాడు యాన్టన్ చీకట్లో ఖైదు చేయబడ్డాడు. ఎంతో చలిగా వుంది. అతనికి కాలచక్రం ఆగిపోయినట్లు తోచింది. ఒళ్లు వెచ్చపరచుకోటానికి చేతులు రాచుకుంటో, కాళ్ళు తాడిస్తో ఒక మూలనుంచి యింకొక మూలకి పచార్లు చేస్తున్నాడు. అప్పటికే చాలా రాత్రియింది. చీకటి గాఢంగా వుంది. పరిసర ప్రాంతమంతా అతి నిశ్శబ్దంగా వుంది. "ఈ గడువు వాళ్ళకి సరిపోతుందా ? నిష్కారణంగా చనిపోవటం వ్యర్థం" అని ఆలోచిస్తూ ఆందోళన పడుతున్నాడు. అకస్మాత్తుగా దూరంలో ఒక పేలుడు ధ్వని వినవచ్చింది. షివెడ్జి వులిక్కిపడి, తలుపు సందులోంచి చూశాడు.

"ఆఁ. యిప్పటికి వారు తమ కర్తవ్యం నెరవేర్చారు. ప్రధాన ఆశయం నెరవేరింది. ఇంక నేను తప్పించుకునే మార్గం చూసుకోవచ్చును"అనిఅనుకున్నాడుషివెడ్జి. హుషారుగా యీలవేస్తో పచారు చేస్తున్నాడు. చీకటిలో దొరికిన చిన్న ఇనుపముక్కతో సిమెంటులో కన్నంచెయ్య మొదలెట్టాడు. యింతలోనే పహరా సైనికుడు తలుపుతెరచి రైఫిల్ మడమతో ఒకటంటించి 'బయటికి రా' అని అరచాడు. షివెడ్జి నీడ్చుకువెళ్ళి ఒక బల్లకు బంధించారు.

"గెరిల్లా లెక్కడ ?" అని గర్జించాడు జర్మన్ ఆఫీసరు. షివెడ్జి జవాబియ్యలేదు. నాజీ ఆఫీసరు ఆజ్ఞపై బలమైన ఒక జర్మన్ సైనికుడు షివెడ్జి చేతిని నొక్కిపట్టి, చేతి రంపముతో కొయ్య మొదలెట్టాడు. షివెడ్జి ఒళ్ళంతా చెమటపోసింది.కళ్లెర్రబడ్డాయి. అయినా అతని నోటినుండి ఒక్కమాటైనా వెలువడలేదు.

"కమ్యూనిస్టువా ? సోవియట్ అధ్యక్షుడవా ? యెవరు నువ్వు ?" అని ఆ నాజీ బుసకొట్టాడు.

"నే నొక రష్యన్‌ని. ఇంతకు మించి చెప్పటానికేమీ లేదు."

"అన్ని సంగతులూ చెప్పెయ్యి. నిన్ను బహూకరిస్తాను" అని ఆశపెట్టాడు ఆఫీసరు. మిగిలియున్న తన శక్తినంతా కూడగట్టుకుని షివెడ్జి యీ విధంగా జవాబిచ్చాడు. "నువ్వు రాక్షసుడవు. నీకు నామీద యేమాత్రమూ అధికారం లేదు" అంటూ ఆఫీసరు మొహంమీద ఉమ్మేశాడు. వెర్రి కోపంతో ఆఫీసరు రివాల్వరు షివెడ్జికేసి గురిచేశాడు. కాని యింతలోనే గాజు బద్దలయిన శబ్దమూ, రివాల్వరు పేలిన ధ్వనీ. ఆఫీసరు తల యెగిరి గోడకు తగిలింది. మొండెం క్రిందపడింది. జర్మన్ సైనికుడికీ అదే గతి. కిటికీగుండా ఒక స్వరం వినపడింది, "నీవు బ్రతికున్నావా ? యాన్టన్ వాసిలియవిచ్ ?"

జర్మన్ దళమంతా గెరిల్లాల వశమయింది. షివెడ్జికి ప్రథమ చికిత్స చేశారు. ఇంతలో సోవియట్ అధ్యక్షుడు లోపలికి వచ్చి, షివెడ్జి యెదుట గౌరవ సూచకంగా టోపీతీసి "నిన్ను గురించి దురభిప్రాయ పడ్డందుకు చాలా విచారిస్తున్నాను కామ్రేడ్ ;" అన్నాడు.

చిరునవ్వుతో జవాబిచ్చాడు యాన్టన్‌షివెడ్జి

"గ్రామానికొక చౌకడిపో"

ఏ పట్టణంలో చూచినా, ఏ పల్లెలోచూచినా "అధిక లాభాలను అరికట్టాలి" చౌక డిపోలు కావాలి" అనే నినాదాలే ప్రతిధ్వనిస్తున్నాయి. యుద్ధాన్ని సాకుగా దీసికొని బీదప్రజలపై వర్తకుల లాభాలదోపిడీ నల్లేరుమీద బండిలాగ సాగిపోతూనేఉంది. దైనందిన జీవితానికవసరమైన ఆహార సామగ్రి సరసమైన ధరలకు దొరక్కపోవడంవల్ల కార్మికజనసామాన్యంలో అనేక కుటుంబాలు పస్తుపరుండాల్సి వస్తోంది. అందుకనే చొక్కాలు మాడ్చుకొంటూ జీవన్మరణావస్థలోఉన్న బీద ప్రజలలో "అధిక లాభాలను అరికట్టాల"నే ఆందోళన నానాటికీ తీవ్రరూపం దాలుస్తోంది.

ఏలూరు తాలూకాలో

లింగారపుగూడెం గ్రామములో ఆకునూరి చినరామయ్యగారి అధ్యక్షతనూ, జాలిపూడి గ్రామంలో బళ్ళ రామయ్యగారి అధ్యక్షతనూ కొట్లంపూడి గ్రామంలో దాసరి తాతయ్యగారి అధ్యక్షతనూ, తిమ్మరపుగూడెంలో చిక్కాల పోలుగారి అధ్యక్షతనూ, చాటపర్రులో కొమ్మన వెంకటరత్నంగారి అధ్యక్షతనూ వ్యవసాయ కూలీ సభలు జరిగాయి. గ్రామానికొక చౌక డిపో చొప్పున ప్రతిగ్రామంలోనూ చౌకడిపోలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు జరిగాయి. ఆహారపదార్థాలను అధికంగా ఉత్పత్తి చేయటానికి బంజరు భూముల్ని సాగుచేస్తే స్థానిక రివిన్యూ అధికారులచే పెనాల్టీనోటీసులు జారీచేయబడ్డాయి. ఆ నోటీసుల్ని రద్దుచేస్తూ సేద్యంచేసినవారికి ఆభూములపై హక్కు ఖాయపర్చవలసిందనికూడా కోరుతూ పై సభలో తీర్మానాలు చేయబడ్డాయి.

అలగానిపాడులో

సుమారు 2 వందలమంది గ్రామకార్మికులు ఆహారపదార్థాలను సరసమైన ధరలకుఇప్పించు ఏర్పాట్లు చేయమని ఈ గ్రామంలోని భూస్వాములవద్దకు రాయబారం వెళ్ళారు. తమపని పాటల్లో తిరిగేవ్యవసాయ కూలీలకే చౌకడిపోలను ఏర్పాటు చేయిస్తాముగాని ఇతరకార్మికులతో మాకేమీ సంబంధంలేదని ధనికులు వ్యవసాయకూలీలకు మాత్రమే చౌకడిపోలను ఏర్పాటు చేయించారు. కార్మికుల కందరకూ తగినసౌకర్యములను కల్గించనందున యీనెల రెండోతారీఖున 5 వందలమంది కార్మికులు సమావేశమై ధనికుల చర్యను ఖండిస్తూ అందరికీ అందుబాటులోఉండే చౌకడిపోలను వెంటనే ఏర్పాటు చేయించ మని కోరుతూ జిల్లాకలెక్టరువద్దకు రాయబారం పంపటానికి తీర్మానించారు.

గుంటూరు లాగుడుబండ్ల కార్మికులు

పై సంఘంవారు యుద్ధపరిస్థితులమూలంగా తమ కూలీ హెచ్చించాల్సినదిగా యజమానుల్ని కోరుకున్నారు. ఎన్నిసారులు విన్నవించుకున్నా కార్మికులమొర నాలకించినవారు కన్పడలేదు. విసిగ వేసారి చివరకు సమ్మె నోటీసు ఇచ్చారు. యజమానులు "ససేమిరా" అని ఇతరచోట్లనుండి కూలీలను తెప్పించటానికి ప్రయత్నించారు. కాని పాపం ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

అక్టోబరు26నుండి సమ్మె ప్రారంభమైంది. ఒక రైస్‌మిల్లూ, ఏడు వేరుశనగనూనెమిల్లుల యందూ పని పూర్తిగా ఆగిపోయింది. మరునాడే కార్మికుల కోర్కెల్ని యజమానులు కొంతమట్టుకి అంగీకరించారు. కంపెనీ పప్పు లోలకంలో నూటికి నలభై చొప్పున వేరుశనగ మిల్లులలో నూటికి ముప్పై చొ॥ హెచ్చింది. అని ఆసంఘ కార్యదర్శి కనపర్తి నాగయ్యగారు తెలియజేశారు.

కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ సంఘం

ఈ నెల ఒకటో తారీఖున బెజవాడలోని పై సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లాలోని ప్రచారశిక్షణదళంలో కూలీ సంఘ ప్రతినిధిగా కోనాడ సూర్యప్రకాశరరావుగారిని ఏర్పాటు చేస్తూ, జిల్లా ఆఫీసును నాగాయతిప్పనుండి గుడివాడ మార్చుటకునూ తీర్మానించారు. బెజవాడ, గుడివాడ తాలూకాల ఎలెక్షన్లు నవంబరు 15 వ తేదీలోగా పూర్తిచేయాలనీ, నూతన సంవత్సరానికి క్రొత్త సభ్యులను చేర్పిస్తూ ప్రతి సంఘమూతమ కోటాలలో సంఘానికి రూపాయకి తక్కువ లేకుండా విరాళాలను జనవరి నెలాఖరుకు జిల్లా ఆఫీసుకు పంపాలనీ తీర్మానించారు. ఆయాతాలూకాలలో ఈ క్రిందివిధంగా కోటాలు ఏర్పాటు చేయబడ్డాయి. దివితాలూకా :- 80 సంఘాలు. 5 వేలు సభ్యులు. గుడివాడ :- 60 సంఘాలు 2500 సభ్యులు. గన్నవరం :- 40 సంఘాలు రెండువేలు సభ్యులు. బెజవాడ :-30 సంఘాలు 1500 సభ్యులు. బందరు :- 20 సంఘాలు వెయ్యి సభ్యులు. కైకలూరు :-20 సంఘాలు వెయ్యి సభ్యులు. నందిగామ :- 5 సంఘాలు 300 సభ్యులు. నూజివీడు :- 5 సంఘాలు 300 సభ్యులు. మొత్తం 260 సంఘాలు 13,600 సభ్యులు. కోటాలను మించి చేర్పించిన తాలూకా సంఘానికి ఎర్రజండా బహూకరించటానికికూడా నిశ్చయించారు.(3వ కాలం మొ॥)

గుంతకల్లులో

ఏడువందలమంది రైల్వేకార్మికులు "సి.ఒ.పి. యస్." వద్దకు చౌకడిపోలను ఏర్పాటు చేయించమని రాయబారం వెళ్ళారు. జొన్నలు కొర్రలు మొదలగు ధాన్యం సంతలో అమ్మకపోవుటచే చాలఅవస్థ పడుతున్నామనియూ, రైల్వేకాలనీ కంతకూ జీవితావసరములగు వస్తువులు సరసమైన ధరలకు సప్లయి చేయుటకుగాను చౌకడిపోలు ఏర్పాటు చేయించాల్సినదనియూ, కోరుకున్నారు. 'సి. ఒ. పి. యస్.' గారు చౌకడిపోలను ఏర్పాటు చేయించుతాననియూ, ధాన్యంసప్లయి విషయంలో జిల్లా కలెక్టరుతో సంప్రదించి తగు ఏర్పాట్లు చేస్తాననియూ, వాగ్దానంచేశారు.

దొనకొండలో

రైల్వేకార్మికులు నిత్య జీవితావసరములగు బియ్యము, పేప్పు మొదలైన సరుకులు దొరక్కపోవటంవలన అనేక అగచాట్లు పడవలసి వస్తోంది, సుమారు 75 మైళ్ళ దూరంలో ఉన్న గుంటూరునుండి వారుసామగ్రి తెచ్చుకోవాల్సి వస్తోంది. అయిదువందలమంది కార్మికులు—ఒకేఒక ప్రొవిజన్‌ష్యాప్ ఉండటంవల్ల గుంటూరు వెళ్ళటానికి ఒక రోజు సెలవు పెట్టవలసి వస్తోంది. అందరికీ కలిసి ఒకష్యాపే ఉండటంవల్ల అనుకున్నరోజుకు సరిగ్గా దొరకటంలేదు. దొరికినా ఎంతోశ్రమపడవలసి వస్తోంది. ఇంతశ్రమపడ్డా చివరకు లాభాలమహమ్మారికి బలికాక తప్పటంలేదు. కాన రైల్వేఅధికారులు వెంటనే చౌకడిపోలు ఏర్పాటు చేయాలని ఎ. ఉమామహేశ్వరరావుగారు, వ్రాస్తున్నారు.

నెప్పల్లి, కొర్నిపాడు గ్రామాలలో ఆహార అధికోత్పత్తికి ఆటంకాలు కల్పిస్తున్న సాహుకార్లయొక్క, అధికారులయొక్క చర్యల్ని ఖండిస్తూ, వారిపై తగు చర్యతీసుకోవాలనీ, కార్మిక నాయకుడైన కామ్రేడ్ నంబూరి శ్రీనివాసరావుగారిని వెంటనే విడుదల చేయాలనీ, పరపతి పుట్టక కరువుతో మలమల మాడుతున్న కూలీలకు గ్రామ పరపతి సంఘాలలో అప్పులిప్పించే ఏర్పాట్లు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు, ఛల్లపల్లి ఎస్టేటుఉద్యోగులు కూలీ సంఘ వర్కరైన చోరగుడి జాన్ పీటరుగారిని అక్రమంగా కొట్టినందుకు వారిచర్యనుతీవ్రంగా గర్హించారు.

రైతు కూలి సామరస్యం కావాలి

"ఆహార పదార్థముల ధరలు విపరీతంగా పెరిగిపోవుటవల్ల కూలీలు ఎంతో యిబ్బంది పడుతున్నారు. ఈ కష్టసమయంలో కూలీలకు రైతులు ఎంతో సహాయ మొనరించవలసి ఉంది. రైతులు, కూలీలు, యిరువురూ వీడితులే. ఈ ఉభయులూ తమతమ సంఘాల ద్వారా పరస్పర సామరస్యంతో కృషిచేసిననాడే తమ కష్టాలను పోగొట్టుకొన గల్గుతారు. పనిరోజులు సమీపిస్తున్నాయి బస్తా ధాన్యం ఎన్ని రూపాయలమ్మితే అన్నిఅణాలు మగవారికీ, అన్నిముక్కాలులు స్త్రీలకూ కనీసపు కూలిరేటుగా నిర్ణయించుకొని సామరస్యాన్ని పెంపొందించుకోవాలి. తమ జీవితావసరవస్తువులను సరసమైన ధరలకు యిచ్చునట్లు చౌకడిపోలు మొదలైనవాటిని ఏర్పాటుచేసుకోటానికి ప్రభుత్వంపై వత్తిడితేవాలి. తమదైనందిన కోర్కెలకోసం ఐక్యతతో కృషిచేస్తూ — ఫాసిస్టు జపాను దురాక్రమణ సమీపిస్తున్న యీ సమయంలో గాఢమైన ఐకమత్యాన్ని ప్రదర్శించాలని రైతులనూ, కూలీలను కోరుతూ ఏలూరు నుంచి వ్యవసాయకూలీ సంఘ అర్గనైజరు కె. సుబ్బారావుగారు వ్రాస్తున్నారు.

వివిధ వార్తలు

గూడూరు మైకావర్కర్సు యూనియన్

పై సంఘ కార్యవర్గ సమావేశం గూడూరులో కామ్రేడ్ శెట్టి కృష్ణయ్యగారి అధ్యక్షతను సమావేశమై- "యూనియన్ అధ్యక్షుడు యన్. వి రంగాచారిగారిని డిస్మైస్ చేసినందుకు ప్రభుత్వ చర్యను ఖండిస్తూ, మైకా డిపోలలోని కార్మికులకు పాయిఖానాదొడ్లు వగైరా సౌకర్యములు కల్గించాలని పంచాయితీబోర్డు వారిని కోరుతూనూ, సంఘ వార్షికోత్సవాన్ని డిశంబరులో జరపటానికి నిర్ణయిస్తూనూ తీర్మానించారు.

పోలీసుల దౌర్జన్యాలు - అరెస్టులు

పశ్చిమగోదావరి జిల్లా —

పోలీసుల దౌర్జన్యాలు రోజు రోజుకూ శ్రుతిమించి రాగాన పడుతున్నాయి. నిష్కారణంగానే కమ్యూనిస్టు నిర్బంధాలు, సోదాలు జోరుగా సాగుతున్నాయి. కామ్రేడ్ సంకు అప్పారావు, కోటిపల్లి అప్పన్నగార్ల ఇళ్లు సోదా చేశారు. కామ్రేడ్ సంకు అప్పారావు యింటికి నవంబరు 30 వ తారీఖున హాజరుకావాలని డిటెన్షను వారంటు అంటించారు, నర్సాపురం తాలూకా ఆచంటలో ఈ నెల 1 వ తారీఖున కామ్రేడ్ నెక్కలపూడి రామారావుగారిని అరెస్టుచేశారు. కామ్రేడ్ నెక్కంటి నరసింహారావు ఎచ్చటనుంచో పడవలో వస్తూండగా పడవ పెనుగొండ పోలీసు స్టేషనువద్దకు రాగానే ఆ కామ్రేడును అరెస్టుచేశారు. జిల్లా కమ్యూనిస్టుకమిటీ ఆర్గనైజరు కామ్రేడ్ మృత్యుంజయుడుగారినికూడా అరెస్టుచేశారు. పెనుగొండ సబిన్స్పెక్టరూ, పోలీసులూ ఆచంట ఫిర్కాలో వ్యవసాయకూలీలను దౌర్జన్యంగా కొట్టటమూ, తిట్టటమూ వగైరా చేస్తున్నారు.

తణుకులో

పర్మిషన్‌గానీ, నోటీసుగానీ, ఏమీలేకుండానే తణుకు సబిన్స్పెక్టరు ఇద్దరు సిఐడీలతో పశ్చిమగోదావరిజిల్లా కమ్యూనిస్టు కమిటీకార్యాలయంలోకి ప్రవేశించి ఆజిల్లా కామ్రేడ్స్‌తో మాట్లాడుతున్న కామ్రేడ్ సుందరయ్యగారి ఫైల్సు సోదాచేయాలన్నాడు. సెర్చివారంటు చూపించమంటే—"లేద"న్నాడు. అయినా సోదాచూడటానికితనకు "పవర్" ఉందన్నాడు. కాని—వారంటులేనిదే సోదాచూడటానికి వీలు లేదని సుందరయ్యగారు అభ్యంతరం తెలిపిన మీదట—అక్కడ సమావేశమై ఉన్నవారి పేర్లు అడ్రసులూ తీసికొని చక్కాపోయాడు.

పోలీసుల దౌర్జన్యాలు-అరెస్టులు

వెంకటగిరిలో

సబినస్పెక్టరును సస్పెండ్‌చేశారు. "మద్దెల నరసమ్మ" అను హరిజనస్త్రీని 15-10-42 వ తా॥ రాత్రి పోలీసుస్టేషనులో మానభంగంచేసి క్రూరంగా హింసించినట్లు లోగడ వార్త ప్రకటించాము. ఆ కేసు సందర్భంలో జిల్లా అధికారులు విచారించి సబిన్స్పెక్టరును సస్పెండ్ చేసినట్టు వార్త వచ్చింది. ఆ కేసుతోసంబంధంగల ఇతరుల విషయమైకూడా విచారణజరుగుతోంది.

గుంతకల్లులో

సంతలో జీవితావసర మైనసరుకుల్ని సరసమైన ధరలకు అమ్మటంలేదనీ, జొన్నలు, కొర్రలు మొదలైన ధాన్యం దొరకటంలేదనీ, ఈవిషయంలో తగుచర్య తీసుకోవాలనీ, విన్నవించుకోటానికి వందమంది కార్మికులు పోలీసు స్టేషనుకు వెళ్ళారు. సబిన్స్పెక్టరు ఇలాంటివాటితో మాకేమీ సంబంధంలేదని చెప్పుకోటానికివెళ్ళినవారిని గెంటిపారవేస్తూ అగౌరవమూ, అసహ్యమూ అయిన దుర్భాషలాడాడు. వెంటనే సబిన్స్పెక్టరు చర్యను ఖండించటానికి బహిరంగసభ జరిగింది. వర్తకుల దోపిడీని అరికట్టుటకు బదులు తనభాద్యతను మరచి ప్రవర్తించిన సబ్‌ఇన్స్పెక్టరు చర్యను ఖండిస్తు తీర్మానించారు.

విద్యార్థులు

గుంటూరులో

పట్టణ విద్యార్థి సంఘ యాజమాన్యాన బహిరంగసభలు జరుపుకోటానికి అనుమతిలేనందున విద్యార్థుల గదుల్లో 13 సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి.

అనంతపురం విద్యార్థి నాయకులనువెంటనే విడుదల చేయాలనియూ, దక్షిణార్కాటుజిల్లాలో 20 మంది విద్యార్థులపై ఎక్స్టర్నమెంటుఆర్డరు ప్రయోగించిన జిల్లా మేజిస్ట్రేటుచర్యనుఖండిస్తూ ఆ ఆర్డరును రద్దుచేయాలనియూ, విద్యార్థులను డిస్మిస్ చేయుట మొదలగు అన్నామలై యూనివర్సిటీ వైస్‌ఛాన్సెలరుగారి చర్యలను ఖండిస్తూనూ ఆ సమావేశాలలో తీర్మానాలు చేయబడ్డాయి. పాలకొల్లు, మారుటేరువిద్యార్థిసంఘముల వారుకూడా అనంతపురం విద్యార్థి నాయకులను వెంటనే విడుదలచేయాలని కోరుతూ తీర్మానించారు.

బర్మాగతి భారతదేశానికి పట్టకూడదు -

కామ్రేడ్
శ్యామ్ ధనగుప్త

సెప్టెంబరు 15 వ తారీఖుకు "స్వతంత్ర భారత ప్రభుత్వం నిర్మించబడుతుంద"ని అస్సాంలో విధ్వంసక కార్యాలను ప్రోత్సహించిన వారు ప్రచారంచేశారు. సెప్టెంబరు 15 వచ్చేసింది."బెంగాలులోపత్రికలుతాత్కాలికంగా ఆగిపోవటంవల్ల నిజ పరిస్థితులు సరిగా తెలియటంలేదు. కాని భారతదేశం యావత్తూ స్వతంత్ర ప్రభుత్వాలు స్థాపించబడ్డాయి. బెంగాలూ, అస్సామూ మాత్రమే వెనకబడివున్నాయి." అని ప్రచారం ప్రారంభించారు.

ప్రజలుమాత్రం యథార్థాన్ని కొద్ది రోజుల్లోనే గుర్తించారు సెప్టెంబరు 15 తర్వాత విధ్వంసక చర్యలు క్రమక్రమంగా తగ్గిపోతూ వచ్చాయి. సామ్రాజ్యవాదుల పరిపాలన సడలిపోవటానికి బదులు దేశంలో దారుణ నిర్బంధవిధానం విచ్చలవిడిగా తాండవమాడుతోంది. ప్రతిష్టంభన కల్గించుతున్నారనే సాకు తీసికొని ప్రజాశక్తుల్ని విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం విజృంభించింది. నిర్మాణాత్మకమైన ప్రతిపనినీకూడా ప్రభుత్వం నొక్కిపారేయాలని ప్రయత్నించింది అంతకుముందు జిల్లా పౌర రక్షణ సంఘాలు కొద్దో గొప్పో పనిచేయటానికి అవకాశముంది కాని స్థానికాధికారులు ఆ అవకాశాలుకూడా లేకుండా చేశారు.

స్కూళ్ళల్లోనూ, కాలేజీలోనూ, కోర్టులలోనూ కొద్ది రోజులవరకు సమ్మెలు తీవ్రంగా జరిగాయి. కొన్ని కొన్ని చోట్ల ఠాణాలు వశపర్చుకోటానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. స్వాతంత్ర్య సంపాదనకిది మార్గం కాదనే విషయాన్ని మన కామ్రేడ్సు అనేక విధాల నచ్చచెప్పి విధ్వంసకచర్యలు కొనసాగకుండా తీవ్రకృషి చేశారు. కాని పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ, అన్ని తరగతుల ప్రజల్లో కూడ బ్రిటిషు వ్యతిరేకత జపాను కనుకూలంగా పరిణమిస్తోంది.

జపాను దుండగీండ్రు రాష్ట్ర సరిహద్దుల్లో పొంచి కూర్చొని యుంటంవల్ల దండయాత్రా భయం చాల హెచ్చుగాఉంది. అందువల్ల ఐక్యతాఉద్యమాన్ని ప్రజలు పూర్తిగా బలపరుస్తున్నారు. ముఖ్యంగా యీ ప్రాంతపు రైతులలో అధిక సంఖ్యాకులైన మహమ్మదీయులు ఐక్యతా ఉద్యమానికి పూర్తి సహకారమిస్తున్నారు. కాంగ్రెసు- లీగుల మధ్య సఖ్యత అసంభవమనివాదించే "పోరాటం కావాల"నే వారుకూడా కనీసం స్థానిక స్వయంరక్షణకోసమైనా ఐక్యతయొక్క అవసరాన్ని గుర్తించారు. ఈ ఐక్యతా వాంఛను ఆధారంగా తీసికొని మన కామ్రేడ్సు జాతీయైక్యత, జాతీయ ప్రభుత్వములకోసం విజ్ఞప్తులపై సంతకాలు విరివిగా చేయించుతున్నారు.

"విద్యార్థులందరూ ఐకమత్యంతో పనిచేయాల"ని అస్సాం రాష్ట్ర విద్యార్థిసంఘమూ, అస్సాం ముస్లిం విద్యార్థి సంఘమూ కలిసి అన్ని విద్యార్థి సంఘములకూ జాయింటు సర్క్యులరు జారీ చేశాయి. అందువల్ల కొన్ని కొన్ని ప్రాంతాలలో ఐక్యతా ఉద్యమం జయప్రదంగా కొనసాగించబడింది. కాలేజి మాగ్జయినులో మతకలహాలను రేకెత్తించే వ్యాసాలు వ్రాసీ, కాలేజీ ఫౌండర్సు డే సందర్భంలో మతకలహాలను ప్రోత్సహించీ, తగాదాలను తీసికొని రావాలని కొంతమంది ప్రయత్నించారు. చిన్ని చిన్ని ఘటనలను సాకుగా తీసికొని మత విభేదాలను రెచ్చగొట్టి విద్యార్థులలోని ఐక్యతను విచ్ఛిన్నంచేయాలనే ఈప్రయత్నాలన్ని జరిగాయి. కాని విద్యార్థిసంఘాలలోని మన కామ్రేడ్సు సరియైన సమయంలో జోక్యం కల్పించుకొని సౌహార్ద్ర సమావేశముల నేర్పాటుచేసి ఆ ప్రయత్నాలను భగ్నంచేశారు. ఆసమావేశాలలో జపాను దురాక్రమణ నెదిరించుటకు జాతీయైక్యత అవసర మని విద్యార్థులు ఐక్యకంఠంతో చాటారు.

నిరంకుశ ప్రభుత్వపు నిర్బంధవిధానమూ- ప్రజాందోళనలమధ్యా, పంచమాంగ దళమూ- గ్రుడ్డి దేశభక్తులమధ్యా నిలబడి తీవ్ర రాజకీయ ప్రచారం కొనసాగించుట కవసరమైన శిక్షణ నీయుటకు సుర్మావాలీ జిల్లాలో పార్టీ వర్కర్లకు పొలిటికల్‌స్కూలు ఏర్పాటుచేయబడింది. ఈ స్కూలులో శిక్షణపొందిన కామ్రేడ్స్ తమతమప్రాంతాలలోకూడ ఇలాంటి స్కూళ్ళను ఏర్పాటుచేసి చాలమంది వర్కర్లకు ట్రైనింగు ఇచ్చారు.

జపాను దురాక్రమణ నెదిరించుటకోసం ప్రజలను ఆర్గనైజు చేయుటకూ, ప్రజలకు విపత్సమయములలో సహాయపడుటకూ కలకత్తాలో ట్రైనింగు తీసికొన్న కామ్రేడ్ నిర్మల చౌదరి నాయకత్వాన వలంటీరుదళ నిర్మాణము చురుకుగా సాగుతోంది. ఇప్పటికప్పుడే మూడు క్యాంపు లేర్పాటుచేయబడ్డాయి. నాలుగో క్యాంపు జరుగుతోంది.

విధ్వంసకచర్యల మూలంగా ప్రతిచోటా పౌర రక్షణ సంఘాలంటే ప్రజలకు తాత్కాలికంగా అసంతృప్తి వ్యాపించింది. అందువల్ల ప్రజా రక్షణ సంఘాలను తిరిగి నిర్మాణయుక్తంగా కొనసాగించుటకు తీవ్రకృషి చేయబడుతోంది.

సైనికోపయోగములకోసం "కరీంగంజ్"లో హైస్కూలును మిలిటరీ అధికారులు ఆక్రమిస్తే విద్యార్థులు నిర్మాణయుక్తమైన ఆందోళనచేసి ఖాళీచేయించారు. ఇలాగే "పథార్ కండీ"లో తేయాకు తోటలలో పనిచేసే కార్మికులు ఆందోళనచేసి తమ హక్కులను నెరవేర్చుకున్నారు.

సుర్మావాలీ జిల్లా విద్యార్థి సంఘం తరఫున తీవ్ర ప్రచారం కొన సాగించబడుతోంది. "ప్రతి స్కూలులోనూ, ప్రతి గ్రామంలోనూ విద్యార్థి సంఘాలను స్థాపించాలి. ప్రతివిద్యార్థి సభ్యుడుగా చేరాలి." అనే నినాదంమీద పట్టుదలతో పనిచేస్తున్నారు, జిల్లా విద్యార్థిసంఘం తరఫున ఒక ప్రచారకదళంకూడా ఏర్పాటు చేయబడుతోంది.

సుర్మావాలీ జిల్లాలోని ప్రధాన రైతునాయకులందరూ రైతుల పరిస్థితులను తెలిసికొంటూ రైతులలో నూతన చైతన్యాన్నీ, ప్రతిఘటనా శక్తినీ కల్గించడంకోసం తీవ్రకృషి చేస్తున్నారు. అస్సాంలో మొట్టమొదటిసారి జపాను దుండగీడుల బాంబులకు గురియైన సుర్మావాలీ తేయాకు కార్మికులలో ధైర్యాన్ని పురికొల్పి వారి కోర్కెల నెరవేర్చుటకొరకు కార్మిక సంఘం యేర్పాటుచేయబడుతోంది. కచ్చార్ పథార్‌ఖండి, శ్రీమంగల్, సిల్హెట్ ప్రదేశాల్లో కూడ కార్మిక సంఘాలు స్థాపించబడుతున్నాయి.

కాని- జపాను దురాక్రమణను ప్రతిఘటించ ప్రజలను సన్నద్ధపర్చుటకూ, జాతీయ ప్రభుత్వ వాంఛను బలపర్చుటకూ కృషిచేయుచున్న మన కామ్రేడ్స్ నిరంకుశ ప్రభుత్వపు నిర్బంధ విధానానికి గురి కావలసివస్తోంది. ఈ ప్రాంతంలోని అనేకమంది ఫాసిస్టు వ్యతిరేకులగు ప్రముఖులను విధ్వంసకచర్యలను ప్రోత్సహిస్తున్నారనే మిషతో స్థానికాధికారులు యెక్స్టర్నమెంటు, ఇంటర్నమెంటు, అరెస్టులు, డిటెన్షన్లు మొదలగు నిర్బంధాలకు గురిచేస్తున్నారు.

అయినప్పటికీ- ప్రజాశక్తిలో పరిపూర్ణమైన విశ్వాసముండటంవలన ప్రజలను ఐక్యపర్చుట ద్వారానేనిరంకుశాధికారులనిర్బంధాలను నిర్మూలించగలమనే నమ్మకంతో- మన కామ్రేడ్సు ఐక్యతకోసం చక్కగా కృషిచేస్తున్నారు. తమపైనున్న ఈ కర్తవ్యాన్ని నెరవేర్చకపోయినచో- భారతదేశపు భవిష్యత్తు అంధకారబంధురమై పోతుందనీ, భారతప్రజల ఉనికికే భంగంకల్గుతుందనీ వారు గుర్తించారు. అందుకనే- బర్మాకు పట్టినగతి తిరిగి భారతదేశానికి సంప్రాప్తించ కూడదని తూర్పు సరిహద్దున బర్మా పొలిమేరలలోని అస్సాం కమ్యూనిస్టు సోదరులు తీవ్రకృషి చేస్తున్నారు.

(3 వ పేజీ తరువాయి) ఉద్యమాన్ని కొనసాగించటానికి ఎంతైనా ఆర్థిక సహాయం కావాలి. ప్రతిపార్టీ సభ్యుడు, సానుభూతిపరుడు తను యివ్వగలిగినదంతా వెంటనే పార్టీకి విరాళరూపంగా యివ్వాలని పార్టీకోరుతోంది.

పార్టీసభ్యులందరికి

మీరు యిచ్చుచున్న కొద్ది బలంతో యీనాటి పార్టీ అభివృద్ధిచూచారు. పార్టీకొరకు కమ్యూనిస్టుచేయలేని త్యాగంలేదు మీ నాయకుల పంథా మీకు దారిచూపనిండు. మలబారు నాయకుడు కామ్రేడ్ నంబూద్రిపాడ్ 50 వేల రూపాయల విలువగల తన ఆస్తిని పార్టీనిధి కొరకు అమ్ముచున్నాడు పార్టీకేంద్రకమిటీ సమావేశములో 2 లక్షలు వసూలు చేయాలని ర్ణయించినంతనే, ఆంధ్రపార్టీ కార్యదర్శి కామ్రేడ్ రాజేశ్వరరావు తన ఆస్థి మొత్తం విలువ 25000-0-0 లు విరాళం యిస్తానన్నారు.

రాష్ట్రసంఘాలకు

మీరు యిన్నిరోజులుగా పనిజేసిన ప్రజల నుండి మీమీ రాష్ట్రాలకు వ్రాయించిన కోటాలను సులభంగా వసూలుపరచవచ్చు. ఆంధ్ర పార్టీసంగతి తెలిసికొని ఉత్సాహపూరితులు గండు, కేంద్రకమిటీ సమావేశంలో 50000లు తమకోటాగా నిర్ణయించమని కోరిన ప్రప్రథములువారే. తమరాష్ట్రానికి చేరినపిదప జిల్లా నాయకులతో సంప్రతించి, తమకోటాను 50000 నుండి ఒకలక్షఅయిదువందలకు పెంచామంటూ వాగ్దానం చేసారు.

పార్టీలోని కార్మిక సభ్యులకు!

పార్టీయిచ్చిన రాజకీయ నినాదాలకు మీరు ఎల్లప్పుడు మీసహాయాన్నిస్తూనే వున్నారు. ఈరోజున మీవర్గమంత పార్టీ రాజకీయాలకు కావలసిన ఆర్థిక నిధికిమీకున్న ఆదరాభిమానాల్ని ధనరూపంగా యిచ్చేటట్లు చూడండి, ఒక్కొక్క కార్మికుడు ఒకరోజుకూలి పార్టీ నిధికి అని మీనినాదము. మీరు ఆమల్నేర్ కార్మికులదీక్షచూస్తే తప్పకుండా అదేపని చేస్తారు. అక్కడ 3000 మంది కార్మికులున్న ఒకమిల్లువుంది, వారంతా గలసి 500 లు పార్టీనిధికి పంపారు.

పార్టీలో కర్షక ఫ్రేడ్స్‌కు

మీరంతా ధీరులు. మీ తరగతంతా అంతే జాతీయైక్యతకు పునాదియైన గ్రామాలలో మీరు ఆదర్శ త్యాగులుగా వుండాలి. మీరు 70 ఏండ్ల కాపుతల్లి పలోరామాతనుచూడండి. ఆమె కున్నదంతా ఒకే ఒక ఆవు. మన కామ్రేడ్స్ పార్టీనిధికి ఏదైనా విరాళం యివ్వమని అడుగగానే తనకున్న ఆవును కాస్తా యిచ్చేసింది. ఆమెగారు. మలబారు రాష్ట్రఆఫీసుకు పార్టీనిధికిగాను అన్నిరకాల వస్తువులు విరాళంగా యిచ్చారు. ఇదంతా మన పార్టీ జీవించాలని, పనిచేయాలని, విజయాన్నిసాధించాలనేగాదూ.

కామ్రేడ్స్‌కు! యూనిట్లకు!

మీతోనే మీరు ప్రారంభించండి. మీసానుభూతి పరులందరిని కలుసుకోండి. మీరు యిన్ని రోజులుగా పనిచేసిన ప్రజానీకంలోకి పొండి. మనం తప్పక విజయం పొందుతాం. మనం రెండులక్షలు వసూలుచేయుటయే గాదు. యింకా ఎక్కువగా లెనిన్ దినోత్సవానికి (21-1-43) ముందుగనే సంపాదించగలం. ఎంత ఎక్కువ, ఎంత తక్కువవ్యవధిలో చేయగలం? నేను ఊహించలేనంత త్వరగా! యిది మన బోల్షివిక్‌ల సమాధానమై వుండాలి. అది మాటేగాదు కార్యరూపేణా అంతే అని రుజువుచేయాలి.

— పి. సి. జోషి.

(2వ పేజీ తరువాయి) వర్గమునకు ఏమాత్రము అధికారమివ్వలేదు. నిబంధనలకు వ్యతిరేకము కూడ.

పై సమావేశములో సంఘ నిబంధనలు మార్చుటకు 2/3 వంతుకాకుండా మామూలుగా ఒకరు మెజారిటీ వుంటే మార్చవచ్చునని నిబంధనావళిని మార్చినారు. యిప్పుడు సంఘమును రద్దుచేసి ఏజెంట్లపద్ధతిని అవలంబించిరి. యీ చర్యలన్నీ రాష్ట్ర రైతుసంఘము తమ చేతులలోనుండి జారిపోవునని భయముతో చేసిననేగాని రాజకీయ అభిప్రాయబేధము కాదని మేము తలచుచున్నాము.

దుర్భర పరిస్థితులను రైతులు ఎదుర్కొనవలసిన ఈ సమయంలో రైతుసంఘములన్నీ నిర్మాణయుక్తముగా వుండి పనిచేసిననే గాని ప్రస్తుత సమస్యలను ఎదుర్కొనజాలవు, అఖిల భారత రైతుసంఘముతో విడిపోయి, రాష్ట్ర రైతుసంఘమునే రద్దుచేయుటవలన రైతులోకమునకు తీరని నష్టము కల్గినది. దేశరక్షణలు భగ్నము చేయుట దేశస్వాతంత్ర్యమునకే భంగమనిరైతుల యిబ్బందులతీర్చుటకు చక్కని కార్యక్రమము యిచ్చిన అఖిలభారత రైతుసంఘముతో ఎందుకు విడిపోవలెనని తీర్మానము చేసిరో మాకు ఆశ్చర్యము కలిగించింది.

అక్టోబరు 8 వ తేదీ నుండి రాష్ట్ర రైతు సంఘమునకు ఎన్ని ఉత్తరములు వ్రాసినప్పటికి యిప్పటివరకు సభ్యత్వపుస్తకములు పంపించలేదు. చిట్టచివరకు అఖిలభారత రైతు సంఘమువారి అనుమతితో అచ్చువేయించవలసి వచ్చినది. రాష్ట్రరైతుసంఘమువారి యీ విచిత్రపనులు రైతులోకమునకు హాని కల్గజేసినది. వెంటనే అఖిలభారత రైతుసంఘమువారు ఆంధ్రరాష్ట్రములో రైతుఉద్యమం కుంటుపడకుండా సాగునట్లు చేస్తారని ఆశించుచున్నాము.

ముక్కాముల నాగభూషణం (ప్రశిడెంటు) అనుమర్లపూడి వెంకటశీతారామారావు (కార్యదర్శి) కొల్లి సీతారామయ్య (సంయుక్తకార్యదర్శి) కర్ల వెంకట్రామయ్య (రాష్ట్రరైతు సంఘ సభ్యులు)

ప్రభుత్వ అసమర్థతవల్ల ప్రజల కష్టాలు

పీపుల్సువార్ నుండి

"శత్రువు భారతదేశపు సరిహద్దుల్లో పొంచి కూర్చున్నాడు. దేశానికి ప్రమాదం ఏక్షణంలోనైనా సంభవించవచ్చున"ని ప్రభుత్వాధికారులు విసుగూ - విరామం లేకుండా గొంతుచించుకొని అరుస్తున్నారు. కాని-దేశానికి కలిగిన యీ ప్రమాద పరిస్థితులను తొలగించుటకు ఏమాత్రమూ పనిచేయటంలేదు. మన దేశంలోని పట్టణాలపైనా, గ్రామాలపైనా జపాన్ విమానములు ఎగురుతూనే ఉన్నాయి. నిజంగానే - మన దేశం అతి క్లిష్టపరిస్థితిలో చిక్కుకొని ఉన్నది. కాని ప్రభుత్వాధికారులు గ్రుడ్డితనంతో అడుగడుక్కీ, మనం దేశంలో క్లిష్టపరిస్థితులను కల్పిస్తున్నారు.

మూడునెలలక్రింద కాంగ్రెసుపై సాగించిన దాడివల్ల దేశంలో అగ్నిజ్వాల లంటించబడ్డాయి. ఆమంట లింకను చల్లారకముందే ప్రభుత్వాధికారులు కరువు పరిస్థితులను కల్గిస్తున్నారు. భోజన పదార్థాల కొరతను తీర్చుటకూ, సరఫరా మార్గాలను సరిగా యేర్పాటు చేయుటకూ ప్రభుత్వం ప్రయత్నించనందువల్లనే యీ క్షామపరిస్థితులు సంభవించాయి. తమ అసమర్థతను కప్పిపుచ్చుకొనుటకు దొంగ వ్యాపారాన్నీ, సరకు నిలవచేయటాన్ని ఖండిస్తూ వచ్చారు.

ఈ క్షామపరిస్థితులతో ప్రజలు అనేక అవస్థలుపడుతున్న సమయంలో - దేశంయొక్క ఆర్థిక జీవనానికే ముప్పు కల్గించే మరొక విపత్తు తెచ్చిపెట్టారు. నెల రోజులపైనుంచి అనేక పట్టణాల్లో చిల్లర కొరత రోజురోజుకూ ఎక్కువౌతూ వచ్చింది. ఈ చిల్లరకరువు నెమ్మదినెమ్మదిగా దేశమంతా వ్యాపించింది. కొన్నికొన్ని పట్టణాల్లో చిల్లర అసలే దొరకటంలేదు.

బొంబాయిలో ట్రాముల్లోనూ, బస్సుల్లోనూ చిల్లర లేకపోవటంవల్ల ప్రయాణంచేయటానికి వీలుపడటం లేదు. హోటళ్ళలో - వేలు, లక్షలకొలది ప్రజల్ని - యీచిల్లరసమస్యే ఎదుర్కొంటోంది. చిల్లర లేకపోతే తిండి దొరకదని ప్రజలు భయపడుతున్నారు. అనేకమంది కార్మికులు, గుమాస్తాలూ చిల్లర లేకపోవటంవల్ల తిండి దొరక్క ఆకలితోనే పనిపాటల్లోకి పోవలసి వస్తోంది.

ఈ సంక్షోభంనుంచి ఎవ్వరూ తప్పించుకోలేక పోతున్నారు. చిల్లరద్వారానే రోజువారీ పనులుజరుగుతాయి. బజారులో వస్తువులధరలు పెరిగిపోయినా - బేర మింకా చిల్లరలోనే జరుగుతోంది. అందుచే చిల్లర దొరక్కపోవటంవల్ల జీవితం గడవటం దుర్లభమౌతోంది. ప్రతియిల్లూ, ప్రతి కుటుంబమూ, ప్రతి చిన్న వ్యాపారీ, ప్రతి హోటల్ యజమానీ యీ సంక్షోభంవల్ల అవస్థ పడాల్సి వస్తోంది.

ఇందువల్ల ప్రతిచోటా హోటల్ యజమానికీ, హోటలుకు వచ్చినవారికీ, పోట్లాటలు జరుగుతున్నాయి. వెంటనే యీ సంక్షోభాన్ని నివారించకపోయినచో భోజన పదార్థాలను కొనలేకపోవటంకూడా సంభవిస్తుంది. వ్యాపారమంతా నాశనమైపోతుంది. హోటళ్ళన్నీ మూసివేయాల్సి వస్తుంది.

చిల్లరకరువు

ఈ విధంగా ఆర్థిక జీవితమంతా తారుమారైపోతుంది.

శత్రు దండయాత్రాభయం నానాటికీ హెచ్చౌతోంది. అలాంటి సమయంలో మన దేశపరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రభుత్వవిధానంవల్ల రోజుకొక నూతన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సివస్తోంది. యీ ప్రభుత్వ పరిపాలనలో - ప్రతి చిన్ని సంక్షోభమూకూడ - ప్రజలపాలిటి మహమ్మారిగా తయారౌతోంది. ప్రభుత్వ విధానం దేశంలో నలుమూలలా ఆర్థిక జీవితాన్నే నాశనంచేస్తుంది. ప్రజాసామాన్యపు నైతిక శక్తిని నిర్మూలింప జేస్తోంది. శత్రువు నెదుర్కొనబోయే దేశానికి ఇంతకంటే భయంకర పరిస్థితు లెక్కడా కల్పించబడవు.

ఈ నిరంకుశాధికారవర్గం వలె బాధ్యత గల ఏ ప్రభుత్వమున్ను వర్తించి యుండేది కాదు. రాబోయే ఈ క్లిష్టపరిస్థితిని గూర్చి ప్రభుత్వానికి పూర్తిగా తెలుసు. చిల్లరడబ్బులు చాలా కొదువగా ఉన్నాయని కర్రెన్సీ అధికార్లెరుగుదురు. కలకత్తాలోని వర్తకులు చిల్లర డబ్బుల కొదువను గూర్చి యిదివరకే హెచ్చరించి వున్నారు. ఇనుముతోగాని, మరేదైనా లోహములోగాని నాణాలుచేసి ఈ చిక్కును తొలగించమని కోరారు.

కాని, ఉహూ: ప్రభుత్వంకులకదు, పలకదు. అది చేసిందల్లా చిల్లరడబ్బులను కొద్దిమంది షాహుకార్లు నిలవజేస్తున్నారంటూ ఒక ప్రకటన జేయటమే. కాని కావలసింది ఎందువల్ల కొరత ఏర్పడ్డదన్న కారణంకాదు; కొరతను తీర్చుటకు ప్రయత్నాలు; అట్టి షాహుకార్లను నిలవజేయకుండా చేయటం. ప్రభుత్వం ఈ కర్తవ్యాన్ని నెరవేర్చలేదు.

కొద్దిమంది షాహుకార్లు చిల్లరడబ్బులను నిలవజేస్తూ వుండటం వల్లనే ఈ కొరత వచ్చింది అనటం కూడా పూర్తిగా నిజం కాదు ప్రభుత్వము కూడమామూలు వ్యవహారాలకు కావలసిన చిల్లరను సప్లయి జేయలేకపోయింది. 1931 సెప్టెంబరులో 172 కోట్ల రూ. నోట్లచలామణీ; 1942 అక్టోబరుకు నాటికి 512 కోట్లకు; అనగా 340 కోట్లు పెరిగింది. రూపాయినోట్లు,నాణాలు ఇందులో జేర్చబడనేలేదు. వాటినికూడా కలిపి 400 కోట్లు పెరిగింది. ఇందునల్ల చిల్లర ఎక్కువకావలసి వచ్చింది. ధరలు పెరగటంవల్ల కూడా ప్రజలు సరుకులుతక్కువగా కొంటున్నారు. కాబట్టి చిల్లర ఎక్కువ కావలసివచ్చింది. అయినప్పటికీ, మొన్నటి మార్చివరకు చిల్లర 8 కోట్ల రూపాయీలు మాత్రం ఉంది, మార్చినుండి సెప్టెంబరు వరకూ దేశంలో, 3,22,00,000 రూపాయీల చిల్లర ఖర్చుఅయిందంటే ప్రజావుసరాలకు ఎంత చిల్లర కావాలో ఊహించుకోవచ్చు

చిల్లర దాచేవాళ్ళవల్ల పరిస్థితులు కొంత విషమించినమాట వాస్తవమే. రాగిధర పెరగటంవల్ల ఈవిధంగా సంభవించింది. రహస్య వర్తకంలో 72 కానులు 1-8-0 కు మార్చబడుతూ వున్నాయి. బొంబాయిలో రాగిడబ్బులు ఆభరణ ముష్టివాళ్ళదగ్గరనుండి కూడా సేకరించబడి షాహుకార్లచే కరగించబడ్డాయి. 13 లక్షల రూపాయీల రాగిడబ్బులు దాచబడ్డట్లుగా తెలియవస్తోంది; రాగి తర్వాత నికెలుడబ్బులు దాచబడుయిన్నాయి.

ఈ ప్రజాశత్రువుల్ని పట్టడానికి ప్రభుత్వం చేసేదేమిటి? శూన్యం! వారిచర్యలన్నీ దుస్థితిని పెంపుజేస్తానికే ఉపయోగపడుతున్నాయి. మరొక లోహపువైనా చిల్లరను వృద్ధిచేసే బదులు, రిజర్వు బ్యాంకు చిల్లరను మరింత తక్కువజేస్తోంది. రు 2500/- చిల్లర కావలసివచ్చే ఒక సంస్థకు బొంబాయిలో రు 700/- చిల్లర ఇవ్వబడింది. పైగా బెంగాలులో తమ పద్దులలో కానులను జేర్చవద్దని వర్తకులకు రిజర్వుబ్యాంకు సలహా యిస్తోంది,

ఈ దుస్థితి తమకూ, డబ్బును దాచిపెట్టే షాహుకార్లకు మధ్య తగాదాగానే ప్రభుత్వం చూస్తోంది. అనవుసరమైన ఇబ్బందులు పడే ప్రజలమాట అది మర్చిపోతొంది. ప్రజలకు మరింత ఇబ్బందులు కల్పించేమార్గాల ననుసరిస్తోంది. ఈ విధంగా ఈ దుస్థితిని తొలగించలేకపోవడంలో ప్రభుత్వపు అసమర్థత మనకు కొత్తగాదు. చేతకాని అధికారవర్గపు చర్యలవల్లనే ఆర్థిక దుస్థితిపై, ఆర్థిక దుస్థితి సంభవిస్తున్నది. ఈ అసమర్థతవల్ల మనం నాశనం కాకూడదు. తమ తమ రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా ప్రజలంతా ఏకం కావాలి; చిల్లర మరింత జారీచేసి, చిక్కును పరిష్కరించాలని ప్రభుత్వాన్ని నిర్బంధించాలి. ప్రభుత్వపు పాలసీని మార్పిస్తానికి కావలసిన శక్తి, అధికారమూ మన కున్నాయి. మన ఐక్యతా బలంతో ప్రభుత్వాన్ని సవాలుచేయాలి. చిల్లర ఎక్కువ తెప్పించి తీరాలి. అన్నిపార్టీలు, అందరు ప్రజలు ఏకమై సభలద్వారా, ప్రదర్శనాలద్వారా ఈకోర్కెను ప్రతిధ్వనింపజేయాలి. అసమర్థత అంతరించాలి; జాతీయప్రభుత్వం ఏర్పడాలి; అని సభలు ప్రదర్శనాల ద్వారా సవాలు చేదాం!

మిత్రమండలి ఆఫ్రికావిజయాలు రెండవరంగానికి దారితీస్తాయి

(1 వ పేజీ తరువాయి)

ఇటలీలో ఆపజయ భీతి ఒక్కసారి యెక్కువైంది. దీన్ని అరికట్టడానికి ముస్సోలినీ ఒక పెద్ద ఉద్యమం ప్రారంభించాడని వార్త. టోబ్రూకులోని ఇటాలియన్లు నాజీ సైనికులమీద తిరగబడ్డారు. ఇంతవఱకు జర్మనులక్రింద కుక్కిన పేలులాగున వున్న బిజెర్టా, ట్యూనిస్‌లోని ఫ్రెంచి దళాలు జర్మనులపై యెదురు తిరిగి పోట్లాడుతున్నాయి. హిట్లరు అప్పుడే రెండవ ప్రధాన సైనిక కార్యాలయాన్ని నిర్మించుకొంటున్నాడు. దీనికి ముఖ్య కారణాలలో ఒకటి జర్మను ప్రజా సామాన్యం తిరుగుబాటు చేస్తుందేమోననే భీతి.

ఈ నూతన పరిస్థితులను గురించి రష్యనుపత్రిక "ప్రావ్దా" యీ విధంగా చెప్పింది; "హిట్లరు వాదానికి వ్యతిరేకులైన ప్రపంచ ప్రజలంతా ఐక్యమై తమ యావచ్ఛక్తితో ప్రబల శత్రువుపైబడి, యుద్ధభూమిపై అతనిని నాశనం గావించే రోజులు సమీపిస్తున్నాయి.

సోవియట్ అజేయ శూరులు

ఈ నూతనదాడి సోవియట్ భూమిలో మంచి ఉత్సాహాన్ని, సంతోషాన్ని కలిగించినాయి. ఈ నూతనోత్సాహం ముందు నాజీ దాడులు విఫలులైపోతున్నాయి. స్టాలిన్‌గ్రాడ్ వాయువ్యాన ఫ్యాక్టరీ ప్రదేశంలో జర్మనులు ముందుకడుగిడలేక పోతున్నారు. నాజీలు మరొకసారి తమబలాల్ని సమీకరించి దాడి సల్పారు. కాని ఆదాడి క్రొత్తనిర్ణయాన్ని దేనినీ కొనిరాలేకపోయింది. ఒకచోట నాజీలు కొన్ని గజాలు చొచ్చుకుపోయినా, మరల వెనుకకు తరిమివేయబడ్డారు. ట్వాప్సీ, నొవొరొసిస్కు రంగాల్లో ఆగ్నేయంగా జరిగే ప్రతి యుద్ధం నాజీలకు నష్టంగానే పరిణమిస్తోంది. నొవొరొసిస్కు రంగంలో రష్యనులే ముందుకు పోయారు. నాల్చిక్‌లోకూడా రష్యనులు చిన్న విజయాలను సంపాదించారు.

కారీలియా రంగంలో రష్యనులు బహు శక్తివంతమైన క్రొత్త రక్షణలను నిర్మించారు. ఇవి ముర్మాన్స్కునుంచి లెనిన్‌గ్రాడ్ వరకు విస్తరించిఉన్నాయి. వీటి ప్రాముఖ్యతేమిటంటే, ఎంత మంచు కురిసినా తుపాకి కాల్పులకు, యుద్ధ పరిశీలనకు ఆమంచు అడ్డంరాదు.

ప్రాణంకన్నా నూనెచుక్క విలువ

గెరిల్లాలచే ధ్వంశంచేయబడ్డ మైకాపు నూనెగనులు జర్మనుల వశమయి మూడు నెలలు దాటింది. కాని, ఇంతవరకు, ఎంత నేర్పరులైన ఇంజీనీయర్లు పనిచేసినా ఒక్క నూనెచుక్క రాలలేదు. నాజీలు 3 నెలలు కష్టపడి ఒక నూనెభావిని బాగుచేశారు. యంత్రాలన్నీ నిర్మించారు. అంతా రెడీగా ఉంది. కాని, ఎక్కడనుంచో వచ్చారు రష్యను గెరిల్లాలు. మూడు నెలల యంత్ర నిర్మాణం ఇట్టే బుగ్గయిపోయింది. "నూనె ఉత్పత్తి అయేదాక మీకు తిండి దొరకద"ని నాజీలు మైకాపు ప్రజలను బెదరించారు.

నెప్ట్‌గార్స్కు అనే మరొకచోట, ఒక వీధిలో ఉరికంబాలు వరుసనే ఉన్నాయి. ఊరితీయబడ్డ ప్రతి గెరిల్లామీద ఒక పలకఉంది. "నూనెగనులను విధ్వంశం చేసినందుకు" అని ఉంది దానిమీద. కాని, నాజీ దౌర్జన్యం గెరిల్లాల ప్రాణంతీసుకుంటుందేకాని, ఒక్క నూనెచుక్కను పైకితీసుకోలేదు.

నాలుగు సామ్రాజ్యాలకు చర్చిల్‌హామీ

ఈ విధంగా సోవియట్ వీరులు తమస్వాతంత్ర్యానికి, ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యానికి ఫాసిజము, ఇంపీరియలిజము నాశనానికి అద్వితీయంగా ప్రాణాలొడ్డుతూంటే, చర్చిల్ ప్రధాని "మాన్షను హౌస్" ఉపన్యాసంలో స్పెయిన్, పోర్చుగల్ దేశాలకు, వాళ్ళ హక్కులకు, క్షేమాలకు హామీ యిచ్చాడు. ఇవన్నీ సామ్రాజ్య దేశాలే. అంటే, చర్చిల్ వాళ్ళ సామ్రాజ్య హక్కులకు క్షేమాలకూ హామీ యిచ్చాడన్నమాట! ఫ్రాన్సు దేశం జర్మను పాదాల క్రింద పడి ఘూర్ణిస్తూ ఉందట! పాపం! మఱి ఇండియ గతో? తను బ్రిటిషు సామ్రాజ్యాన్ని కంటిరెప్పలా కాపాడుతాడు! అందుకే అతను ప్రధాని. ఈమాటలు చదువుతూండె ప్రతి భారతీయుని హృదయం చెప్పరాని ఆవేదన అనుభవిస్తుంది. ఒక క్రూర కర్కశుని పిడికిలిలోచిక్కి భరింపరాని బాధ పొందినట్లువుతుంది, హృదయంలోంచి రక్తం స్రవిస్తుంది. కాని, సామ్రాజ్యవాదపు అంతిమదినాలుసమీస్తున్నాయి, ఆసమాప్తం ప్రపంచ ప్రజలచేతుల్లోఉంది, మనచేతుల్లోనూ ఉంది, దానికి మొదటిమెట్టు మన జాతీయ ఐక్యత,

Published by Katragadda Rajagopala Rao and Printed at The Popular Printers, Governorpet, Bezwada,

END OF ISSUE